
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పల్నాడు జిల్లా వార్తలు
5
మంగళవారం 29 అక్టోబరు 2024





శనగ.. విత్తనం ఏదీ..?

- రాయితీ కోసం రైతులు ఎదురు చూపు
- ఏపీ సీడ్స్‌కు ఇండెంట్ ఇచ్చిన వ్యవసాయ శాఖ
- 50 శాతం రాయితీ కోరుతున్న అన్నదాతలు

నరసరావుపేట ప్రాంతంలో సాగుకు సిద్ధం చేసిన పొలం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఖరీఫ్‌లో తుపాన్‌ల ప్రభావంతో అతి భారీ వర్షాలకు పంటలు దెబ్బతిన్నాయి. పత్తి పైరు కొన్ని ప్రాంతాల్లో తుడిచిపెట్టుకు పోయింది. ఖరీఫ్‌లో పంటలు కోల్పోయిన రైతులు రబీ సాగు పైనే ఆశలు పెట్టుకున్నారు. శనగ సాగుకు సమాయత్తమయ్యారు. శనగ విత్తేందుకు పొలాలను అన్నదాతలు సిద్ధం చేశారు. అయితే, రబీ సీజన్ ప్రారంభమై వారాలు గుడుస్తున్నా విత్తన సరఫరా లేదు. ప్రభుత్వం 25శాతం మాత్రమే శనగ విత్తనానికి రాయితీ ఇస్తుందని వ్యవసాయశాఖ అధికారులు ప్రకటిస్తుండటంతో అన్నదాతలు పెదవి విరుస్తున్నారు. ఖరీఫ్‌లో పంటలు కోల్పోయిన తమకి, 50 శాతం సబ్సిడీపై శనగ విత్తనం సరఫరా చేయాలని రైతులు కోరుతున్నారు.

శనగ సాగు ఇలా..

జిల్లా	సాధారణ (విస్తీర్ణం ఎకరాల్లో)	గత ఏడాది సాగు
బాపట్ల	80,365	69,655
పల్నాడు	25,810	45,363
గుంటూరు	21,380	27,410

రబీలో పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాలో విస్తృతంగా శనగ సాగు చేస్తారు. బాపట్ల జిల్లాలో అత్యధికంగా సాగు చేస్తారు. పల్నాడు, గుంటూరు జిల్లాల్లో కూడా శనగ సాగుకు రైతులు సిద్ధమయ్యారు. పల్నాడు, గుంటూరు జిల్లాల్లో అతి భారీ వర్షాలకు పత్తి పంట వేలాది ఎకరాల్లో తుడిచిపెట్టుకుపోయిన విషయం తెలిసిందే. అధిక వర్షాలకు ఉన్న పంట దిగుబడులు కూడా అంతంత మాత్రం గానే ఉన్నాయి. తొలి కాపు పూర్తి అయిన పత్తి పంటను రైతులు తొలగించి వేసి ఆ పొలాల్లో శనగ సాగు చేపట్టనున్నారు. ఈ మేరకు భూములను సిద్ధం చేస్తున్నారు. బాపట్ల జిల్లాల్లో శనగ సాధారణ విస్తీర్ణం 80,365 ఎకరాలు, పల్నాడు జిల్లాల్లో 25,810, గుంటూరు జిల్లాలో 21,380 ఎకరాలు సాధారణ విస్తీర్ణంగా వ్యవసాయ శాఖ వెల్లడించింది. అయితే పల్నాడు, గుంటూరు జిల్లాల్లో పత్తి సాగు ఖరీఫ్‌లో గణనీయంగా తగ్గింది. వేలాది ఎకరాల్లో పత్తి పంట వర్షాలకు దెబ్బతిన్నది. ఈ నేపథ్యంలో సదరు రైతులు శనగ సాగు చేస్తారని, దీంతో సాగు విస్తీర్ణం పెరుగుతుందని అంచనా వేసింది. ఈ మేరకు విత్తనం కోసం వ్యవసాయ శాఖ ఏపీ సీడ్స్‌కు ఇండెంట్ పంపింది. ఏపీ సీడ్స్ నుంచి ఇంకా విత్తనం సరఫరా కాలేదని వ్యవసాయ అధికారులు తెలిపారు. 25 శాతంపై శనగ విత్తనం పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని విత్తన నిల్వలు రాగానే పంపిణీ ప్రారంభిస్తామని వారు పేర్కొన్నారు.

రాయితీ 25 నుంచి 50 శాతంకు పెంచాలి

ఖరీఫ్‌లో పంటలు కోల్పోయిన నష్టపోయిన బాధిత రైతులు శనగ విత్తనం రాయితీ 50 శాతానికి పెంచాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. వైసీపీ ప్రభుత్వం గతంలో ఉన్న శనగ విత్తనం రాయితీని 50 నుంచి 25 శాతానికి తగ్గించింది. మళ్లీ కూటమి ప్రభుత్వం ఏర్పడటంతో రాయితీని పెంచాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. అయితే 25 శాతం రాయితీపై శనగ విత్తనం పంపిణీ చేయనున్నట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు. కాగ్ 2 రకం విత్తనం క్వింటా ప్రైవేట్ మార్కెట్‌లో రూ 9 వేల ధర పలుకుతోంది. ఈ విత్తనం ధరను ఏపీ సీడ్స్ క్వింటా రూ. 12,100గా నిర్ణయించింది. 25 శాతం రాయితీ పోను రైతులు 9,075 చెల్లించాలి. జేజే 11 రకం అసలు ధర రూ.9,400గా నిర్ణయించారు. రాయితీ పోను క్వింటాల్‌కు రూ 7050 చెల్లించాలి. ఈ రెండు రకాలు ప్రైవేట్ మార్కెట్ కంటే ఏపీ సీడ్స్ ఎక్కువ రేటు ప్రకటించిందని రైతులు తెలిపారు. ప్రైవేట్ మార్కెట్‌కు అనుగుణంగా విత్తన ధరను నిర్ణయించాలని, 50 శాతం రాయితీ ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. ఏపీ సీడ్స్ ప్రకటించిన ధరలను కూడా తగ్గించాలన్న డిమాండ్ రైతుల నుంచి వినిపిస్తోంది. వెనువెంటనే ఎకరాకు 40 కేజీల చొప్పున శనగ రాయితీపై విత్తన సరఫరాను ప్రారంభించా లని రైతులు కోరుతున్నారు. విత్తన సరఫరాలో మరో వారం రోజులు జాప్యం జరగవచ్చనే అభిప్రాయం వ్యవ సాయ వర్గాల నుంచి వ్యక్తమవుతోంది.





మోక్షమెప్పుడు?

- రేషన్‌కార్డులు, పింఛన్ల కోసం సామాన్యుల ఎదురు చూపులు
- 8 నెలలుగా నిలిచిపోయిన దరఖాస్తు ప్రక్రియ
- ఎన్నికల కోడ్‌తో మార్చిలో ఆగిపోయిన వైనం
- అప్పటి నుంచీ ఫ్రీజింగ్‌లోనే ప్రభుత్వ వెబ్‌సైట్లు
- గత ప్రభుత్వ ఏరివేతతో కార్డులు, పింఛన్లు కోల్పోయిన ప్రజలు
- ఇదిగో.. అదిగో అనుకుంటూనే ఐదు నెలలు గడిపేసిన కొత్త ప్రభుత్వం
- ఒత్తిడి పెరగడంతో ఆఫ్‌లైన్ దరఖాస్తులతో ఎమ్మెల్యేల ఊరడింపు

పేదలకు పట్టెడన్నం కావాలంటే రేషన్‌కార్డు కావాలి. పండుటాకులకు కూసింత భరోసా దక్కాలంటే పింఛన్లు కావాలి. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదు నెలలు పూర్తయినా ఇప్పటి వరకూ వాటి ఊసే లేకుండా పోయింది. దీంతో జనసామాన్యం వాటి కోసం ఆశగా ఎదురు చూస్తోంది. వైసీపీ హయాంలో అకారణంగా రేషన్ కార్డులు, పింఛన్లు కోల్పోయి, తిరిగి పొందడం కోసం ఆశగా కూటమి ప్రభుత్వం వైపు ఆశగా ఎదురు చూస్తున్నారు.

గుంటూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పింఛన్ ఒక్కసారిగా రూ.3నుంచి 4వేలకు పెరిగింది. దాంతోపాటు సూపర్ సిక్స్ పథకాలు ఒక్కొక్కటిగా అందుబాటులోకి వస్తున్నాయి. వీటిలో ఏ పథకం పొందాలన్నా రేషన్‌కార్డును ప్రభుత్వం ప్రామాణికంగా తీసుకోవడం అనాదిగా వస్తున్న విధానం. దీంతో ప్రతి ఒక్కరూ పింఛన్లు, రేషన్ కార్డులకోసం ఎదురు చూస్తున్నారు. వీరిలో గత వైసీపీ ప్రభుత్వం తొలగించిన పింఛనుదారులు, కార్డుదారులే అధికంగా ఉన్నారు. వారికి తోడు వైసీపీ హయాంలో దరఖాస్తు చేసుకున్నా కార్డులు రానివారు, తాజాగా అర్హత పొందినవారు జతయ్యారు. వారంతా ఇప్పుడు పింఛన్లు, రేషన్ కార్డుల కోసం ఎదురు చూస్తున్నారు. అయితే గత మార్చిలో వచ్చిన ఎన్నికల కోడ్ కారణంగా దరఖాస్తు ప్రక్రియ ఆగిపోయింది. ఆ తరువాత ప్రభుత్వం మారి కూటమి అధికారంలోకి వచ్చింది. కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాల దరఖాస్తు ప్రక్రియను తిరిగి పునరుద్ధరించలేదు. వెబ్‌సైట్లన్నింటినీ అచేతన స్థితిలో పెట్టింది. ఇలా పెట్టిన ప్రభుత్వం ఐదు నెలలు పూర్తయినా దాన్ని తొలగించలేదు. దీంతో రేషన్‌కార్డులు, పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకునే వీలే లేకుండాపోయింది.

● మూడు జిల్లాల్లో 25వేల దరఖాస్తులు పెండింగ్..

గత వైసీపీ ప్రభుత్వం రకరకాల నిబంధనలు ప్రవేశపెట్టి పింఛనుదారులు, కార్డుదారుల్లో భారీగా కోతలు పెట్టింది. సగటున ప్రతి పది మందిలో ఒకరు అర్హత కోల్పోయి ఇబ్బందులకు గురయ్యారు. వారు అప్పట్లోనే పలుమార్లు దరఖాస్తు చేసుకున్నప్పటికీ ప్రభుత్వం పదే పదే తిరస్కరించింది. గత రేషన్‌కార్డుల దరఖాస్తుల పరిస్థితి మరీ అధ్వానంగా ఉంది. కొత్తగా రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకోవడం, పేర్లు చేర్చుకోవడం, కార్డును విభజించుకోవడం వంటి సదుపాయాలు లేక ఏళ్ల తరబడి ప్రజలు ఎదురు చూడాల్సి వచ్చింది. చివరి ఏడాదిలో వైసీపీ ప్రభుత్వం అవకాశం కల్పించినా అవి దరఖాస్తు దశలోనే అగిపోయాయి. అసెంబ్లీ ఎన్నికలకు ముందు అనేక మంది రేషన్ కార్డులు, పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. కానీ వారి దరఖాస్తులు ఇప్పటికీ పెండింగులోనే ఉన్నాయి. అందుతున్న సమాచారం మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఈ దరఖాస్తులు 2 లక్షలకు పైగా పెండింగులో వున్నాయని, గుంటూరు, పల్నాడు, బాపట్ల మూడు జిల్లాల్లో కలిపి 25వేల దరఖాస్తులు పెండింగులో ఉన్నాయని తెలుస్తోంది. వారంతా ఎనిమిది నెలలుగా కళ్లు కాయలు కాచేలా ఎదురు చూస్తున్నారు కానీ ప్రభుత్వం నుంచి ప్రకటన మాత్రం రావడంలో లేదు. ఇదిగో అదిగో అంటూనే కొత్త ప్రభుత్వం ఐదు నెలల కాలాన్ని నెట్టేయడంపై ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. తాజాగా దీపావళి నుంచి ఉచిత గ్యాసు సిలిండర్ పథకం అమలు కావడం, దానికి రేషన్ కార్డునే ప్రామాణికంగా వుంటుందని తెలుస్తుండడంతో ఈ డిమాండు మరింత పెరిగింది.

ఎమ్మెల్యేలపై పెరుగుతున్న ఒత్తిడి

పింఛను, రేషన్ దరఖాస్తుల కోసం కూటమి పార్టీల కార్యాలయాలకు వచ్చేవారి సంఖ్య అంతకంతకూ పెరుగుతూ వుంది. ప్రధానంగా స్థానిక ఎమ్మెల్యే కార్యాలయాల్లో వీరి తాకిడి అధికంగా వుంది. రోజువారీ దరఖాస్తుల్లో ఈ రెండు విభాగాల నుంచే 70 శాతానికి పైగా దరఖాస్తులు వస్తున్నాయి. దీంతో ఒత్తిడిని తట్టుకోలేని ఎమ్మెల్యేలు ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు తీసుకుంటున్నారు. తమ కార్యాలయంలో ఒకరిని ఆ పని కోసం కేటాయించి వచ్చిన వారి నుంచి దరఖాస్తులు తీసుకుని వారి పేర్లు నమోదు చేసి ఒక జాబితాను రూపొందిస్తున్నారు. దీంతో దరఖాస్తుదారుల్లో ఒకింత ఊరట కనిపిస్తున్నా ఈ ప్రక్రియ తమకు ఉపయోగపడుతుందా.. లేదా అన్న అనుమానమూ ప్రజల్లో వ్యక్తమవుతోంది.

పట్టభద్రులంతా ఓటు నమోదు చేసుకోవాలి

- కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు, అక్టోబరు (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా - గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ శాసనమండలి సభ్యుల ఎన్నికలకు అర్హులైన వారు ఓటరుగా నమోదు చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో గ్రాడ్యుయేట్స్ ఎంఎల్‌సీ-2025 ఎన్నికలకు సంబంధించి ఓటరు నమోదుపై కలెక్టర్ జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ-2025 ఎన్నికలకు ఓటరుగా నమోదుకు నవంబరు 6వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించటం జరుగుతుందన్నారు. పట్టభద్రుల నియోజకవర్గం ఎన్నికలకు ఓటరుగా నమోదు కావడానికి 2024 నవంబరు 1వ తేదీ నాటికి గ్రాడ్యుయేషన్ పూర్తిచేసి మూడు సంవత్సరాలు అయి ఉండాలన్నారు. 2021 నవంబరు 1వ తేదీ నాటికి గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి ఉండాలని స్పష్టం చేశారు. సాధారణ డిగ్రీలతో పాటు పదవ తరగతి తరువాత మూడు సంవత్సరాల డిప్లొమా చేసిన వారు ఓటరుగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి గతంలోనిఓటరు జాబితాను పరిగణలోకి తీసుకోరని, అందువలన ప్రతి ఒక్కరు నూతనంగా ఓటు కోసం ఖచ్చితంగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు.

ఫారం-18 ద్వారా ఓటరుగా నమోదు చేసుకోవచ్చని, ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లోని ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే వీలు ఉందన్నారు. ఏఈఆర్‌ఓలు బీఎల్‌ఓల ద్వారా ఇంటింటి పరిశీలన చేసి గ్రాడ్యుయేట్‌లను ఓటరుగా నమోదు చేయించాలన్నారు. అలాగే జిల్లా కార్యాలయాల హెచ్‌ఓడీలు తమ కార్యాలయ గ్రాడ్యుయేట్ సిబ్బంది ఓటరుగా నమోదు చేసుకున్నారో, లేదో తనిఖీ చేయాలన్నారు. కృష్ణ - గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ శాసన మండలి సభ్యుల ఎన్నికలకు గుంటూరు జిల్లాలో ఇప్పటివరకు 39 వేల దరఖాస్తులు మాత్రమే అందాయని, నవంబర్ 6 లోపుగా గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఓటర్లను నమోదు చేసే లక్ష్యంతో ఏఈఆర్వోలు క్షేత్రస్థాయిలో విస్తృత స్థాయిలో అర్హత ఉన్న ఓటరుకు అవగాహన కల్పించి, ఓటరుగా నమోదు చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఏ భార్గవ్ తేజ, డీఆర్‌వో పెద్ది రోజా, డిప్యూటీ కలెక్టర్లు లక్ష్మీకుమారి, గంగరాజు, ఆర్‌డీవో శ్రీనివాసరావు, శేషశ్రీ, చేనేత, జౌళి శాఖ ఏడీ వనజ, డీఎస్‌ఓ కోమలి పద్మ, పంచాయితీ రాజ్ ఎస్‌ఈ గుర్రం బ్రహ్మయ్య, జిల్లా వ్యవసాయ శాఖాధికారి వెంకటేశ్వర్లు , గ్రౌండ్ వాటర్ డీడీ వందనం, హార్టికల్చర్ డిప్యూటీ డైరెక్టర్ రవీంద్ర, మత్స్య శాఖ ఏడి గాలి దేముడు, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ శ్రావణ్ బాబు, జిల్లా ఉపాధి కల్పనాధికారి వీ రమాదేవి, సమగ్ర శిక్ష ఏపీడీ విజయ లక్ష్మి, ఐసీడీఎస్ పీడీ యం ఉమాదేవి తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.



పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై జిల్లా అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం

- ఇద్దరుఅధికారులపై వేటు
- మరో నలుగురికి షోకాజ్ నోటీసులు
- కలెక్టర్ అరుణ్‌బాబు

నరసరావుపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం, విధులలో అలసత్వం వహించిన ఇద్దరు అధికారుల సస్పెన్షన్. నలుగురు అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. ఆచ్చంపేట విస్తరణ అధికారి కే వీర్రాజు, బొల్లా పల్లి విస్తరణ అధికారి జానీ బాషాను సస్పెండ్ చేసినట్లు వెల్లడించారు. శావల్యాపురం, దుర్గి, రాజుపాలెం, పిడుగురాళ్ళ ఎంపీడీవోలకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలన్నారు. నరసరావుపేట కలెక్టరేట్‌లో పారిశుధ్య పనులపై సోమవారం నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ రానున్న రెండు రోజులలో అన్ని తాగునీటి ట్యాంకులను శుభ్రపరచి క్లోరినేషన్ ప్రక్రియ పూర్తిచేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కొన్ని రోజులుగా కొన్ని ప్రాంతాల్లో డయేరియా కేసులు నమోదు అయ్యాయని ఇందుకు పరిశుభ్రత లోపించడమే కారణమన్నారు. మండల అధికారులు, మునిసిపల్ అధికారులు పారిశుధ్యం పై దృష్టి సారించాలన్నారు. ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. రోడ్ల మార్జిన్‌లలో ఉన్న వ్యర్థాలను వెంటనే తొలగించాలని సూచించారు. మండల పరిషత్ అధికారులు నిర్లక్ష్యం వీడి పారిశుధ్యం పనులపై క్షేత్ర స్థాయిలో ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జిల్లాలో బదిలీ అయిన పంచాయతి కార్యదర్శులు వెంటనే విధుల్లో చేరాలని, విధులలో నిర్లక్ష్యం వహించే మండల అధికారులు, ఈఓపీఆర్డీలు తదితరుల పై శాఖాపరమైన చర్యలతోపాటు సస్పెండ్ చేసే విధంగా చర్యలు ఉంటాయన్నారు. క్లాప్ మిత్రలకు జాప్యం లేకుండా జీతాలు సకాలంలో చెల్లించాలన్నారు. పీఎం విశ్వకర్మ పథకంపై కలెక్టర్ సమీక్షించారు. పీఎం విశ్వకర్మ లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలన్నారు. జేజేఎం కుళాయిల కనెక్షన్ల ప్రక్రియ వేగవంతం చేసి లక్ష్యాలను చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి భాస్కర రెడ్డి, జిల్లా వైద్య శాఖాధికారి డాక్టర్ బీ రవి, డీఎల్‌పీఓ వెంకటరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్, కమిషనర్లు పాల్గొన్నారు

వంద రోజుల ప్రణాళిక లక్ష్యాల పురోగతి వేగవంతం చేయాలి

వంద రోజుల ప్రణాళిక కాలంలో మరో 65 రోజులు మాత్రమే మిగిలి ఉన్నందున లక్ష్యాల పురోగతిని వేగవంతం చేయాలన్నారు. ప్రభుత్వ గృహాలు, అంగన్‌వాడీ భవనాలు, సంక్షేమ హాస్టళ్ల నిర్మాణాలకు ఇసుక కేటాయింపుల్లో ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ప్రభుత్వ నిర్మాణాలకోసం ప్రత్యేకంగా ఒక రీచ్‌ను రిజర్వ్ చేయాల న్నారు. పీఎం గ్రామ స్వరాజ్య యోజన ద్వారా ఇప్పటివరకూ రోడ్డు లేని నివాసాలకు నూతన రోడ్ల నిర్మాణాలకు అనుమతులు పొందాలన్నారు. అంగన్ వాడీ సెంటర్లలో పోషణ వాటిక, హార్వెస్టింగ్ నిర్మాణాలు, టాయిలెట్లు నిర్మాణాలు 15 కల్లా పూర్తి చేయాలన్నారు. ఉపాధి హామీ ద్వారా 3,58,824 పని దినాలు ఉపాధి కల్పించి ఇళ్ల నిర్మాణాలకు వేగవంతం చేయాలని డ్వామా పీడీని ఆదేశించారు. వంద రోజుల ప్రణాళిక లక్ష్యాలు సాధించడంలో మండల స్పెషల్ ఆఫీసర్ల సేవలు వినియోగించుకోవాలన్నారు. సమావేశంలో హౌసింగ్ పీడీ వేణుగోపాల్ రావు, పంచాయతీ రాజ్ ఎస్‌ఈ , ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ, డ్వామా పీడీ లింగమూర్తి, జిల్లా ఉద్యాన అధికారి రమణారెడ్డి, సంక్షేమ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో కలెక్టర్ పీ అరుణ్‌బాబు

ఒక టన్ను కూడా లేదు

- ఇదీ జిల్లాలో ఇసుక నిల్వల పరిస్థితి
- రీచ్‌ల్లో తవ్వకాలు ప్రారంభమైతేనే లభ్యం
- చేతులెత్తేసిన మైనింగ్ శాఖ

జిల్లాలో ఇసుక కొరత తీవ్ర రూపం దాల్చింది. మైనింగ్ శాఖ వద్ద ఒక టన్ను ఇసుక నిల్వ లేదు. మాదిపాడు స్టాక్ పాయింట్‌లో ఉన్న నిల్వలు పూర్తిగా నిండుకున్నాయి. మైనింగ్ శాఖ చేతులెత్తేసింది. కృష్ణానదికి వరద వలన ఇసుక తవ్వకాలు జరిగే పరిస్థితి లేదు. మూడు రోజుల్లో ఇసుక తవ్వకాలు ప్రారంభిస్తామని మైనింగ్ శాఖ సోమవారం తెలిపింది. అయితే ఆచరణలో ఆ పరిస్థితులు కానరావడం లేదు. రీచ్‌లో నీరు తగ్గితేనే ఇసుక తవ్వకాలు జరిగే పరిస్థితి. ఇది నిర్మాణ రంగంపై తీవ్ర ప్రభావం చూపుతోంది.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వం ఉచిత ఇసుక అని చెబుతున్నా వినియోగదారుడుకి అందే పరిస్థితి లేదు. పథకం ప్రారంభం నుంచి జిల్లాలో ఇసుక సరఫరాపై సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారన్న విమర్శలున్నాయి. ఉచిత ఇసుక విధానం ఇష్టం లేదన్నట్లుగా అధికార యంత్రాంగం వ్యవహరించిందని వినియోగారుల నుంచి ఆరోపణలు [illegible] రీచ్‌లో తవ్వకాల టెండర్లు ఖారులోనూ జరిగింది. కృష్ణానదికి వరద లేని సమయంతో రీచ్‌లో తవ్వకాలు జరిపే విషయంలో అధికారులు మీనమేషాలు లెక్కించారు. యంత్రాంగం అలసత్యం జిల్లాలో ఒక్క టన్ను కూడా ఇసుక నిల్వ లేకపోవడానికి కారణమన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. మైనింగ్ శాఖ ముందస్తు చర్యలు చేపట్టకపోవడంతోనే ఇసుక నిల్వలు లేకుండా పోయాయి. ఆరు రీచ్‌లు గుర్తించినా ఇసుక తవ్వకాలు జరపలేకపోయారు. ఉన్న ఇసుక నిల్వలు ఎన్ని రోజులకు సరిపోతుందో అంచనా ఉన్నా ముందస్తు చర్యలు చేపట్టకపోవడం వలనే కొరత నెలకొందని చెప్పవచ్చు. కృష్ణానదికి వరద కొనసాగుతోంది. వరద తగ్గినా రీచ్‌లో నీటి నిల్వలు తగ్గే వరకు తవ్వకాలు జరిపే అవకాశం ఉండదంటున్నారు. ఇసుక కొరత అభివృద్ధి పనులపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ప్రభుత్వ శాఖల్లో చేపట్టిన అభివృద్ధి పనులు పూర్తిగా నిలిచిపోయాయి. ప్రైవేట్ నిర్మాణ రంగంపై ఇసుక కొరత ప్రభావం అధికమైంది. అంబడిపూడిలో మూడు రీచ్‌లు, దిడుగు, కోనూరు, పొందుగలలో ఒక్కొక్క రీచ్‌లో ఇసుక తవ్వకాల కోసం మైనింగ్‌శాఖ టెండర్లు నిర్వహించింది. ఈ రీచ్‌లలో 4.23 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వలు ఉన్నాయని మైనింగ్‌శాఖ ప్రకటించింది. ఈ రీచ్‌లలో వరద తగ్గేవరకు ఇసుక తవ్వకాలు జరిగే పరిస్థితులు లేవు. పొరుగు జిల్లాల నుంచి ఇసుక సరఫరా చేయాలని వినియోగదారులు కోరుతున్నారు. మైనింగ్ శాఖ జిల్లా అధికారి నాగయ్య మాట్లాడుతూ ఇసుక నిల్వలు లేవని తెలిపారు. మూడు రీచ్‌లలో తవ్వకాలు జరిపేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. మూడు రోజుల్లో తవ్వకాలు ప్రారంభించనున్నట్టు చెప్పారు. ఇప్పట్లో ఇసుక సమస్య పరిష్కారం అయ్యే పరిస్థితులు లేవనే చెప్పాలి.



పంచారామ భక్తులకు మెరుగైన బస్సు సౌకర్యం



ఈవో సునీల్‌కుమార్‌తో మాట్లాడుతున్న ఆర్టీసీ ఆర్ఎం రవికుమార్, రామకృష్ణ

అమరావతి, అక్టోబరు 28: నవంబరు 1వ తేదీ నుంచి ప్రారంభమయ్యే కార్తీక మాస పర్వదినాల్లో పంచారామ పుణ్యక్షేత్రాల్లో ప్రథమ ఆరామంగా పేరుగాంచిన అమరావతిలోని అమరేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించే భక్తులకు ఆర్టీసీ మెరుగైన బస్సు సౌకర్యాన్ని కల్పిస్తుందని గుంటూరు రీజినల్ మేనేజర్ రవికుమార్ తెలిపారు. సోమవారం అమరేశ్వరస్వామి దేవస్థాన కార్యనిర్వాహణాధికారి పి. సునీల్‌కుమార్‌ను ఆర్ఎంతోపాటు డీఎం రామకృష్ణ కలిసి అమరావతికి బస్సులు నడపడంపై చర్చించారు. ప్రత్యేకంగా దూరప్రాంతాల నుంచి పంచారామాలు సందర్శించే భక్తులకు ఇతర క్షేత్రాలు సందర్శించేలా ఆలయంలో ప్రత్యేక క్యూలైన్‌లు ఏర్పాటు చేయనున్నట్లు ఈవో సునీల్‌కుమార్ తెలిపారు. పాలకొల్లు నుంచి బయలుదేరి సాయంత్రానికి అమరావతి చేరుకునే భక్తులకు పది గంటల వరకు స్వామివారి దర్శన సౌకర్యం కల్పిస్తామని ఈవో చెప్పారు. పంచారామాలకు కేటాయించిన బస్సుల సమాచారాన్ని ప్రత్యేక వాట్సాప్ గ్రూప్ ద్వారా తెలియజేయాలని ఆర్టీసీ అధికారులను కోరారు. విజయవాడ వైపు నుంచి వచ్చే బస్సులను గుంటూరు ఇన్నర్ రింగ్‌రోడ్ మీదుగా అమరావతి చేరుకునే విధంగా చర్యలు తీసుకుంటామని ఆర్ఎం తెలిపారు. గుంటూరు నుంచి కూడా ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

పాతకక్షల నేపథ్యంలో యువకుని హత్య



వివరాలను సేకరిస్తున్న సీఐ శ్రీనివాసరావు

దుర్గి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పాతకక్షల నేపథ్యంలో యువకుని హత్య మండలంలోని అడిగొప్పులలో జరిగింది. గ్రామానికి చెందిన షేక్ సైదా (28) వ్యవసాయ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం గ్రామ శివారులో సైదా తన స్నేహితులైన ఒప్పిచర్ల జాని, నగీషాలతో మద్యం తాగాడు. ఈ క్రమంలో సైదా, జానిల మధ్య ఘర్షణ జరిగింది. కాగా జాని గ్రామంలోకి చేరుకుని తన స్నేహితుడైన శివకృష్ణకు జరిగిన ఘర్షణను వివరించాడు. శివకృష్ణ వెంటనే సైదాకు ఫోన్ చేసి మాట్లాడగా వీరివురి మధ్య వాదోపవాదాలు జరిగాయి. ఈ క్రమంలో జాని, శివకృష్ణ ద్విచక్ర వాహనంపై గ్రామంలోని సెంటర్లో బేకరి వద్ద ఉన్న సైదా వద్దకు చేరుకున్నారు. శివకృష్ణ తనతో తెచ్చుకున్న కత్తితో సైదా ఛాతిపై పొడిచాడు. దీంతో సైదా కింద పడిపోయాడు. స్థానికులు సైదాను దుర్గిలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు చెప్పారు. దుర్గి పోలీసులు ఆసుపత్రికి చేరుకుని వివరాలను సేకరించి కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు సంతానం. హత్య సంఘటనపై దుర్గి సీఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామానికి చెందిన హుస్సేన్, జానీబాషా, శివకృష్ణ స్నేహితులని, హుస్సేన్ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పని చేస్తున్నట్లు చెప్పారు. అయితే హుస్సేన్ మూడు నెలల క్రితం సైదా భార్య ఫోన్‌కు వాట్సాప్ మెసేజ్ పెట్టగా, ఆ సమయంలో పెద్దలు రాజీ కుదిర్చి హుస్సేన్ చేత సైదా భార్యకు క్షమాపణ చెప్పించారన్నారు. ఈ క్రమంలో కక్ష పెంచుకున్న హుస్సేన్ తన స్నేహితులతో సైదాను హత్య చేయించి ఉండవచ్చని అనుమానం వ్యక్తమవుతోందని సీఐ శ్రీనివాసరావు చెప్పారు.

ఆస్తి కోసం కుటుంబ సభ్యుల మధ్య ఘర్షణ

- ఒకరు మృతి.. మరొకరి పరిస్థితి విషమం
- ఇద్దరికి గాయాలు



షేక్ మహమ్మద్ బాషా (పాతచిత్రం)

క్రోసూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆస్తి వివాదాల నేపథ్యంలో ఒకే కుటుంబానికి చెందిన సభ్యుల మధ్య ఘర్షణ జరిగింది. ఇందులో ఒకరు మృతి చెందగా, మరో ముగ్గురికి తీవ్ర గాయాలైన సంఘటన క్రోసూరు మండలం హసానాబాద్ గ్రామంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. హసానాబాద్ గ్రామానికి చెందిన మీరాబీకి, అదే గ్రామానికి చెందిన హుస్సేన్ సాహెబ్‌తో 25 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వారికి మహమ్మద్ బాషా జన్మించాడు. తరువాత వారిద్దరి మధ్య విభేదాలు రావటంతో భర్తతో విడాకులు తీసుకొని తమ్మవరం గ్రామానికి చెందిన నాగూల్ మీరాను వివాహం చేసుకుంది. వారికి ఇద్దరు అమ్మాయిలు, ఒక అబ్బాయి జన్మించారు. అమ్మాయి చనిపోగా మరో అమ్మాయికి వివాహం చేశారు. చిన కుమారుడు అబ్దుల్ బాసిత్, మొదటి భర్త కుమారుడు మహమ్మద్ బాషా కూడా తల్లితో కలసి ఉంటున్నాడు. ఇటీవల కాలంలో మహమ్మద్ బాషాకు వివాహం కావటంతో వేరేగా ఉంటున్నాడు. మహమ్మద్ బాషాకు తన తండ్రి ద్వారా రెండు ఎకరాల పొలం, రెండు సెంట్ల స్థలం ఆస్తి లభించగా, రెండో భర్త కుమారుడికి 50 సెంట్ల స్థలం, రెండు సెంట్ల స్థలం రెండో భర్త ద్వారా లభించాయి. ఆస్తి మొత్తం కలిపి సమానంగా తీసుకోవాలని తల్లితో సహా రెండో కుమారుడు అబ్దుల్ బాసిత్ గొడవ పడుతూ వస్తున్నారు. ఉమ్మడిగా ఆస్తి తీసుకోవటానికి మహమ్మద్ బాషా అంగీకరించకపోవటంతోపాటు ఎవరి తండ్రి ద్వారా సంక్రమించింది వారే తీసుకుందామని చెబుతూ వస్తున్నాడు. ఈ క్రమంలో మూడు నెలల నుంచి కుటుంబ సభ్యులు అనేకమార్లు గొడవలు పడ్డారు. ఇటీవల క్రోసూరులో జరిగిన ప్రజా దర్బార్‌లో కూడా ఒకరి మీద ఒకరు ఫిర్యాదు చేసుకున్నారు. ఆదివారం రాత్రి రెండో భర్త కుమారుడు, రెండో భర్త తరుపు వారు కొంతమంది మొదటి భర్త కుమారుడు బాషాపై దాడికి దిగారు. బాషా తరుపున అతని మామ చిన బాజీ, మరి కొందరు ఘర్షణలో పాల్గొన్నారు. మహమ్మద్ బాషాకు, చిన బాజీకి బలమైన గాయాలు అవ్వటంతో వారిని సత్తెనపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి, మెరుగైన చికిత్స కోసం గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మహమ్మద్ బాషా సోమవారం ఉదయం మరణించాడు. అతని మామ చిన బాజీ పరిస్థితి కూడా ఆందోళనకంగా ఉంది. షేక్ బాసిత్, మీరాబీకి గాయాలయ్యాయి. పెదకూరపాడు సీఐ సురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మా భూముల్లో మొక్కలు నాటుతున్నారు

- రైతుల ఆందోళన, మొక్కలు నరికివేత



ఫ్యాక్టరీ ఆవరణలో ధర్నా చేస్తున్న సొసైటీ భూముల రైతులు

దాచేపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): దాచేపల్లి మండలం గామాలపాడు సమీపంలోని ఆంధ్రా సిమెంట్స్ హద్దును ఆనుకొని ఉన్న భూముల్లో సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యం మొక్కలు నాటింది. గామాలపాడు, ఇరికేపల్లి గ్రామాల సొసైటీ భూములకు చెందిన రైతులు సోమవారం ఆయా మొక్కలను నరికి వేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఏళ్ల తరబడిగా తమ పూర్వీకుల నుంచి హక్కుగా సంక్రమించిన భూముల్లో సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యం రోడ్లు, మొక్కలు వేయటం చేస్తుందని ఆరోపించారు. ఫ్యాక్టరీ యాజమాన్యం సొసైటీ భూములకు సంబంధించి సుమారు 75 ఎకరాల భూమిని ఆక్రమించిందని, ఈ విషయంపై తాము న్యాయస్థానాన్ని ఆశ్రయించామన్నారు. విషయం కోర్టులో ఉండగా ఫ్యాక్టరీ యాజమాన్యం మాత్రం ఆ భూముల్లో రోడ్లు వేయటం, మొక్కలు నాటడం చేస్తుందన్నారు. తమకు న్యాయం జరిగే వరకు సొసైటీ భూముల్లోకి ఎవరూ రావడానికి వీలులేదని రైతులు స్పష్టం చేశారు. వివాదంలో ఉన్న భూముల్లో కూర్చొని ధర్నా చేశారు.

ఆ భూములు మావే : ఫ్యాక్టరీ యాజమాన్యం

ఆంధ్రా సిమెంట్స్ ఫ్యాక్టరీకి చెందిన భూముల్లోనే మేము రోడ్లు వేయడం, మొక్కలు నాటడం చేశామని ఆంధ్రా సిమెంట్స్ యాజమాన్యం స్పష్టం చేసింది. ఈ విషయంపై అనుమతులు లేని వ్యక్తులు ఫ్యాక్టరీ హద్దుల్లోకి ప్రవేశించి 180 మొక్కలను నరికేశారని ఆరోపించారు. దీనిపై దాచేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో డాక్టర్ కోడెల విగ్రహం తొలగింపు

- కోడెల అభిమానుల నిరసన
- ఆస్పత్రి సూపరింటెండెంట్ మంత్రూ నాయక్ ఘెరావ్
- ఎమ్మెల్యే అరవిందబాబు తొలగించమన్నారంటూ సమాధానం



కోడెల విగ్రహం



కోడెల విగ్రహాన్ని తొలగించి పగలకొట్టిన దిమ్మె

నరసరావుపేట లీగల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట లింగంగుంట్లలోని ఏరియా ప్రభుత్వ ఆస్పత్రిలో ఉన్న డాక్టర్ కోడెల శివప్రసాదరావు విగ్రహాన్ని ఆస్పత్రి వర్గాలు గుట్టుచప్పుడు కాకుండా తొలగించాయి. విగ్రహం ఏర్పాటుకు నిర్మించిన దిమ్మెను కూడా పగలకొట్టారు. కోడెల విగ్రహం తొలగింపు టీడీపీలో వివాదాస్పదమైంది. ఆస్పత్రి నిర్మాణానికి కోడెల కృషి చేశారు. ఇందుకు గుర్తుగా ఆయన వర్ధంతి సందర్భంగా కోడెల అభిమానులు ఆస్పత్రి ఆవరణలో ఆయన విగ్రహం ఏర్పాటు చేశారు. వర్ధంతి రోజు కూడా విగ్రహాన్ని ఆవిష్కరించకుండా అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో విగ్రహం ఆదివారం రాత్రి తొలగించడంతో వివాదాస్పదంగా మారింది. విగ్రహం తొలగింపుపై కోడెల అభిమానులు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ కార్యాలయంలో సోమవారం ఆందోళన చేశారు. సూపరింటెండెంట్ మంత్రూ నాయక్‌ను ఘెరావ్ చేశారు. విగ్రహాన్ని ఎవరు తొలగించమన్నారో తెలపాలంటూ ఆయన్ను నిలదీశారు. సమాధానం చెప్పే వరకు ఆందోళన కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా మంత్రూ నాయక్ మాట్లాడుతూ ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ఆదేశాల మేరకు తొలగించామని చెప్పారు. దీంతో అభిమానులు తీవ్ర అగ్రహావేశాలు వ్యక్తం చేశారు. పట్టణాన్ని ఎంతో అభివృద్ధి చేసిన నవ్యాంధ్రప్రదేశ్ తొలి స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాదరావు విగ్రహం ఏర్పాటు చేయకూడదా అంటూ నిలదీశారు. విగ్రహాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కోడెల విగ్రహం ఏర్పాటు చేసిన నాటి నుంచి దీనిని ఆవిష్కరించకుండా పోలీసు పహరా ఏర్పాటు చేశారు. చివరకు విగ్రహం తొలగించడాన్ని టీడీపీ శ్రేణులు తప్పుపడుతున్నాయి. టీడీపీ అధికారంలో ఉన్న కూడా దివంగత కోడెలకు ఇంతటి అవమానామా అని ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబును వివరణ కోరగా విగ్రహం తరలింపులో తనకు ఎటువంటి సంబంధం లేదనీ, తాను ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్‌కు విగ్రహం తరలింపు విషయంలో ఎటువంటి సూచనలు చేయలేదన్నారు. ఈ ఘటనతో తనకు ఎటువంటి సంబంధం లేదన్నారు.

గొడవలకు దిగితే పీడీ యాక్ట్ నమోదు : డీఎస్పీ



పోలీసులతో మాట్లాడుతున్న సత్తెనపల్లి డీఎస్పీ హనుమంతరావు

రాజుపాలెం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): గ్రామంలో ప్రతిఒక్కరూ సయోధ్య, సఖ్యతతో మెలగాలని సత్తెనపల్లి డీఎస్పీ మేదరమెట్ల హనుమంతరావు తెలిపారు. సోమవారం తెల్లవారుజాము నుంచి రాజుపాలెం మండలం నెమలిపురిలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. గ్రామంలో అనుమానించే ప్రాంతాలు, పాడుబడిన పశువుల పాకలు, పలు నివాస గృహాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ గ్రామస్తులతో మాట్లాడుతూ గతంలో ఈ గ్రామంలో హత్య జరిగిందనీ, మళ్లీ ఏమైనా అలజడులు సృష్టించినా, గొడవలకు పురిగొల్పినా సహించేది లేదని, అవసరమైతే గ్రామ బహిష్కరణకు కూడా వెనుకాడబోమన్నారు. గొడవలకు దిగితే ఆస్తి, కుటుంబ వ్యవస్థ పాడైపోతుందన్నారు. నెమలిపురిలో రౌడీషీటర్లు కూడా ఉన్నారని, మరెవరైనా గొడవలకు దిగితే వారిపై కూడా రౌడీషీట్ ఓపెన్ చేస్తామన్నారు. ఒక్కసారి గొడవలకు పాల్పడితే ప్రతి పండగకు, ఎన్నికలు జరిగినా బైండోవర్ కేసులు నమోదు చేస్తామన్నారు. మద్యం తాగి గొడవలకు పాల్పడినా, పేకాట ఆడినా తగు కేసులు నమోదు చేస్తామన్నారు. ధ్రువీకరణ పత్రాలు సరిగాలేని 20 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ తనిఖీలో సీఐలు సుబ్బారావు, బ్రహ్మయ్య, వెంకటప్రసాద్, శ్రీనివాసరావు, ఎస్ఐ వేణుగోపాల్, సబ్‌డివిజన్ పరిధిలోని పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో సోమవారం 42.16 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 45,850 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుందన్నారు. ప్రాజెక్టు వద్ద 44,222 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుంది. దీనిలో 16వేల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు వస్తున్నాయి.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.50 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	128, 138,148
చికెన్ విత్ స్కిన్	240.00
చికెన్ స్కిన్ లెస్	250.00

54,065 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 63,735 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 54,065 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 28,584 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	8500	16000	334	9000	16000
నెంబరు. 5	9000	13500	నెంబరు. 5	10800	11500
273	11500	12000	273	10000	13500
341	9000	15000	341	9000	13500
4884	10500	14500	4884	9000	16000
సూపర్ 10	--	--	సూపర్ 10	–	–
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	7500	18400	తేజ	8000	18300
బ్యాడిగి	9000	16000	బ్యాడిగి	9000	14000
దేవనూరు డీలక్స్	10000	14500	దేవనూరు డీలక్స్	10000	15000
తెల్లకాయలు	5000	12000	తెల్లకాయలు	6000	11500

సాగర్ ప్రాజెక్ట్ 2 క్రస్ట్‌గేట్లద్వారా నీటి విడుదల

మాచర్ల రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు వరద నీరు వస్తుండడంతో ప్రాజెక్ట్ అధికారులు సోమవారం 2 క్రస్ట్‌గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. 2 గేట్లను 6 అడుగులు మేర ఎత్తి 19,880 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కాగా నాగార్జున సాగర్ నీటి మట్టం 590.00 అడుగులు ఉంది. ఇది 312.04 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 10,160 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 6791 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,679 క్యూసెక్కులు, 2 క్రస్ట్‌గేట్ల ద్వారా 19,880 , ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400, ఎల్ఎల్‌సీ ద్వారా 400, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్ 69,310 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. ఇన్‌ఫ్లో వాటర్‌గా 69,310 క్యూసెక్కుల వచ్చి చేరుతోంది.

జోన్‌లో మొదటి స్థానంలో నిలిచాం

- గుంటూరు-2 డిపో మేనేజర్ అబ్దుల్ సలామ్



గుంటూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు జోన్ పరిధిలోని నెల్లూరు, ప్రకాశం, ఉమ్మడి గుంటూరు జిల్లాల పరిధిలోని ఆర్టీసీ డిపోల్లోనే రూ.72 లక్షల ఆదాయంతో లాభాల్లో మొదటి స్థానంలో గుంటూరు-2 డిపో నిలిచిందని డిపో మేనేజర్ అబ్దుల్ సలాం తెలిపారు. డిపో పరిధిలో మొత్తం 112 సర్వీసులుండగా 7 ఏసీ సర్వీసులు, 15 సూపర్ లగ్జరీ, 22 అల్ట్రాడీలక్స్, 9 ఎక్స్‌ప్రెస్‌లు, ఇతర పల్లెవెలుగు సర్వీసులున్నాయన్నారు. డిపో పరిధిలో లాభాలు తీసుకురావటంలో తీసుకున్న చర్యలతోపాటు సమస్యలపై ఆయన సోమవారం మాట్లాడారు. దీనిపై 'ఆంధ్రజ్యోతి' ఫటాఫట్.



డిపోను లాభాల్లోకి ఎలా తేగలిగారు?

డీఎమ్: డిపో పరిధిలో ప్రయాణికుల సౌకర్యాలకు అనుగుణంగా బస్సులను పెంచాం. గతంలో హైదరాబాద్‌కు 10 సర్వీసులుండగా 15కు పెంచాం. వైజాగ్ 2 సర్వీసుల నుంచి 4కు పెంచాం. గుంటూరు నుంచి బెంగళూరుకు ఇంద్ర (ఏసీ) సర్వీసుతో రోజుకు రూ.లక్ష ఆదాయం సమకూరుతుంది. అంతేగాక గుంటూరు-విజయవాడ నాన్ స్టాప్ సర్వీసులు గతంలో 15 ఉంటే 25కు పెంచాం. అరుణాచలం గిరి ప్రదక్షణకు ఈ ఏడాదిలో రాష్ట్రంలోనే టాప్‌లో 28 సర్వీసులు నడపటం వంటి చర్యలతో లాభాల్లోకి తెచ్చాం.

గ్రామాల్లో ఆర్టీసీ సర్వీసులు పరిస్థితి ఏమిటి?

డీఎమ్: డిపో పరిధిలో ఇప్పటికే 47 గ్రామాలకు పల్లెవెలుగు సర్వీసులను అందుబాటులోకి తెచ్చాం. డిపో పరిధిలో నిత్యం 26వేల మందికి పైగా ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా సర్వీసులు ఏర్పాటు చేస్తాం.

డిపో పరిధిలో ఈపీకే ఎలా ఉంది?

డీఎమ్: డిపో పరిధిలో ఎర్నింగ్ పర్ కిలోమీటర్ (ఈపీకే) రూ.45.37లుగా ఉంది. ఇది రాష్ట్రంలోనే 11వ స్థానంలో డిపో ఆదాయంలో ఉండటం డిపో, గ్యారేజ్ సిబ్బందితో పాటు సమష్టి కృషితో సాధ్యమైంది.

సెల్‌ఫోన్ డ్రైవింగ్ ఫిర్యాదులపై చర్యలు ఏమిటి?

డీఎమ్: సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేసినా, మద్యం తాగి విధులకు వచ్చినా విధుల నుంచి తప్పించటమే మరో ప్రశ్నే లేదు. దీనిని సీరియస్‌గా పరిగణిస్తున్నాం. దీనిపై ఉన్నతాధికారులు కూడా స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

పేదల ఇళ్లకు ఉచితంగా స్థలం ఇస్తా

- విశ్రాంత ప్రధానోపాధ్యాయురాలు నరిశెట్టి రాజమ్మ
- అభినందించిన సీఎం చంద్రబాబు నాయుడు



సీఎం చంద్రబాబు నాయుడును కలిసిన నరిశెట్టి రాజమ్మ

నకరికల్లు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పేదలు ఇళ్లు నిర్మించుకునేందుకు తనకు ఉన్న స్థలాన్ని ఉచితంగా ఇస్తానని పల్నాడు జిల్లా, నకరికల్లు మండలం, తురకపాలెం గ్రామ శివారు, కమ్మవారిపాలెం గ్రామానికి చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయురాలు నరిశెట్టి రాజమ్మ ముందుకు వచ్చారు. సోమవారం సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలసిన నరిశెట్టి రాజమ్మ తమ గ్రామంలో ఇళ్లు లేని పేద కుటుంబాలు ఉన్నాయని తెలిపారు. ఆ పేద కుటుంబాలకు ఇంటి నిర్మాణానికి అనుమతులు మంజూరు చేస్తే ఇళ్లు నిర్మించుకునేందుకే ఒక్కొక్కరికి రెండు లేక మూడు సెంట్ల చొప్పున స్థలం ఇచ్చే తాను సిద్ధంగా ఉన్నానని ఆమె తెలిపారు. ఈ విషయమై చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ త్వరలో రాష్ట్రంలో గృహ నిర్మాణ పథకం ప్రారంభమవుతుందని తెలిపారు. ఆ సమయంలో సంబంధిత అధికారులు మిమ్మల్ని సంప్రదిస్తారని చంద్రబాబు ఆమెకు చెప్పారు. పేదలు ఇళ్లు నిర్మించుకునేందుకు ఉదారంగా స్థలం ఇచ్చేందుకు ముందుకు వచ్చిన నరిశెట్టి రాజమ్మను సీఎం చంద్రబాబు నాయుడు అభినందించారు.

బెస్ట్ ఉమెన్ ఇంజనీరింగ్ టీచర్ అవార్డు గర్వకారణం

గుంటూరు (విద్య), అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఐఎస్‌టీఈ) నుంచి బెస్ట్ ఉమెన్ ఇంజనీరింగ్ టీచర్ 2023 - స్టేట్ అవార్డు ఆర్‌వీఆర్ అండ్ జేసీ కళాశాల అధ్యాపకురాలు ప్రొఫెసర్ డా. ఏ. శ్రీకృష్ణకు లభించడం గర్వకారణమని ఆర్.వి.ఆర్ అండ్ జె.సి. ఇంజనీరింగ్ కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, రాయపాటి గోపాలకృష్ణ, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ కె.మద్దినేని సోమవారం ప్రకటనలో తెలిపారు. కళాశాల ఐటీ విభాగ ప్రొఫెసర్ అండ్ విభాగాధిపతిగా ఉన్న డాక్టర్ ఏ. శ్రీకృష్ణను ఐ.ఎస్.టి.ఈ ఆంధ్రప్రదేశ్ సెక్షన్ 'బెస్ట్ ఉమెన్ ఇంజనీరింగ్ టీచర్' అవార్డుకు ఎంపిక చేసి గోల్డ్ మెడల్, సర్టిఫికెట్‌ను ఐ.ఎస్.టి.ఈ. చైర్మన్ ప్రొఫెసర్ జి.రంగ జనార్దన్, హానర్ సెక్రటరీ ప్రొఫెసర్ బి.ఈశ్వర రెడ్డి చేతుల మీదుగా ఆమెకు అందజేశారు.

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

ఆయుర్వేద మందులు అందజేత

పిడుగురాళ్ల, అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక 2వ వార్డులో సోమవారం ఆయుర్వేద వైద్యశిబిరం నిర్వహించారు. వార్డులో మహిళలు, వృద్ధులు పలువురికి డాక్టర్ మేఘమాల వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతగా పాటించాలని, అప్పుడే వ్యాధులు దరిచేరకుండా ఉంటాయని సూచించారు. కార్యక్రమంలో జొన్నలగడ్డ శ్రీను, విష్ణు, గోవిందయ్యతో పాటు అంగన్‌వాడీ టీచర్ జయశ్రీ, శాంతకుమారి, ప్రభుదాసు, యోగ శిక్షకులు హనుమంతునాయక్, కోటేశ్వరమ్మ పాల్గొన్నారు.

నేడు వినతుల స్వీకరణ

ముప్పాళ్ళ అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ముప్పాళ్ళలో మంగళవారం నిర్వహించే ప్రజా సమస్యలపై వినతుల స్వీకరణ కార్యక్రమంలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పాల్గొంటారని టీడీపీ టీడీపీ అధ్యక్షుడు బత్తుల నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ ముప్పాళ్ళ కార్యాలయంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి మండలంలోని అన్ని గ్రామాల నుంచి ప్రజలు తరలివచ్చి వారు ఎదుర్కొంటున్న సమస్యలను అర్జీల రూపంలో ఎమ్మెల్యే కన్నాకు వివరించవచ్చని సూచించారు. సమావేశంలో రావిపాటి నానయ్య, షేక్ మాబూ సుభానీ, పఠాన్ లీలాఫర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి దరఖాస్తు పరిష్కారం కావాలి

- లేకుంటే అధికారులపై చర్యలు
- ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్
- అచ్చంపేటలో ప్రజాదర్బార్
- ప్రజల నుంచి 276 అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే


ప్రజల నుంచి విజ్ఞప్తులను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

అచ్చంపేట, అక్టోబరు 28 (ఆంధ్ర జ్యోతి) : ప్రజా దర్బార్‌కు వచ్చిన ప్రతి దరఖాస్తు పరిష్కారం కావాలని, లేకుంటే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ హెచ్చరించారు. అచ్చంపేటలో సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ప్రజాదర్బార్‌కు అనూహ్య స్పందన వచ్చింది. మొత్తంగా 276 దరఖాస్తులను ఎమ్మెల్యే ప్రవీణ్ ప్రజల నుంచి స్వీకరించారు. అనంతరం ఎమ్మెల్యే ప్రవీణ్ మాట్లా డుతూ ప్రజాదర్బార్‌లో సమస్యలు పరిష్కారమౌ తాయన్న నమ్మకంతో ప్రజలు అర్జీలను అందజేశా రని, వాటన్నింటినీ ఆయా శాఖల అధికారులకు పంపుతామని, అధికారులు వాటిని పరిశీలించి న్యాయబద్ధమైన ప్రతి అర్జీని వెంటనే పరిష్కరించాలని అన్నారు. ఐదు వారాలకు ఒకసారి మండల కేంద్రానికి వస్తానని, ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో పని చేయాలని సూచించారు. రెవెన్యూ శాఖలోని ఆర్ఐ, వీఆర్వో, సర్వేయర్లు గట్టిగా పని చేయాలని, సమస్యల పరిష్కారం విషయంలో ప్రజల నుంచి ఎవరూ డబ్బు ఆశించవద్దని అధికారులను హెచ్చరించారు. విద్యుత్ అధికారులు గ్రామాల్లో నెలకొన్న సమస్యలను వేగంగా పరిష్కరించాలని, మెటీరియల్ అవసరమైతే తనకు తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో కే.శ్రీనివాసరావు, డిప్యూటీ తహసీల్దార్ పీ.సునీత, ఇతర అధికారులతో పాటు టీడీపీ మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం, నేతలు కిలారిరాజన్‌బాబు, నల్లమేకల వెంకటేశ్వర్లు, పాటిబండ్ల బాపిరాజు, ఎనిగండ్ల కోటయ్య, మొక్క పాటి గిరిబాబు, పోట్ల శ్రీనివాసరావు, కొలగాని సత్యనారాయణ, మట్టం భద్రారావు, తిరువాయిపాటి అంజనేయులు పాల్గొన్నారు.

ప్రజా దర్బార్‌లో రేషన్‌కార్డులు, భూ సమస్యలు, పింఛన్‌లు, పోలీసుస్టేషన్‌లో సమస్యలపై మొత్తం 276 దరఖాస్తులు వచ్చాయి. కోగంటివారిపాలెం, అగ్రహారం భూముల్లో 1385.16 ఎకరాలు కాగా 9/1, 9/2 నోటీసులు జిల్లా ఏడీఏకు పంపాలని అర్జీలు పెట్టుకున్నారు. అచ్చంపేటలోని హిందూ శ్మశానవాటిక అభివృద్ధి చేయాలని, మండలంలో అసంపూర్తిగా ఉన్న అంగన్ వాడీ కేంద్రాలు పూర్తి చేయాలని దరఖాస్తులు అందించారు. తాడువాయి పంచాయతీ పరిధిలోని బంగారు తండా వద్ద డ్రెయినేజ్ ఆర్అండ్‌బీ రోడ్డుపై ప్రవహిస్తుందని, సమస్యను పరిష్కరించాలని చల్లగరిగ, గింజుపల్లి, మాదిపాడు గ్రామస్థులు కోరారు. మాదిపాడులోని అగ్రహారం భూ సమస్యలు, మాదిపాడులో డ్రెయి నేజ్ సమస్యలు పరిష్కరించాలని అర్జీలు అందజేశారు.

అనంతరం 21వ అఖిల భారత పశుగణన పోస్టర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు.

అర్హులందరూ ఓటర్లుగా నమోదు కావాలి

- అవగాహన కార్యక్రమంలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : సత్తెనపల్లి పట్టణంలో అర్హులైన వారందరూ ఓటర్లుగా నమోదు కావాలని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని రాఘవేంద్ర బాల కుటీర్‌లో సోమవారం ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు నమోదు పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కన్నా మాట్లాడుతూ 2021 నాటికి డిగ్రీ పూర్తి చేసిన వారంతా ఓటర్లుగా నమోదు కావాలన్నారు. ఎంఎల్‌సీ ఎన్నికల్లో విద్యా వంతులు, మేధావులు అందరూ ఓటు హక్కును వినియోగించు కోవాలన్నారు. ప్రతి గ్రాడ్యుయేట్ కూడా ఓటు నమోదు చేయించు కోవాలన్నారు. జగన్ ప్రభుత్వం విద్యా వంతులకు విద్యావకాశాలు లేకుండా చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిరుద్యోగాన్ని రూపు మాపేందుకు కృషి చేస్తుందన్నారు. వంద రోజుల్లో రాష్ట్రంలో అభివృద్ధిసంక్షేమం జరుగుతుందన్నారు. రాబోయే ఎన్నికల్లో కూటమి ఎంఎల్‌సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాదును ఓట్లు వేసి గెలిపించాలన్నారు. నవంబరు 6వ తేదీ లోపు అందరూ ఓటర్లుగా నమోదు కావాలన్నారు. కార్యక్రమంలో రాఘవేంద్ర బాల కుటీర్ నిర్వాహకులు వెలుగూరి సుబ్బరాయుడు, కొల్లిపర కాశీ విశ్వనాథం, జవ్వాజి రామ్మోహనరావు, పోతుగంటి రామకోటేశ్వరరావు, కొత్త లక్ష్మయ్య, రాఘవేంద్ర బాల కుటీర్ ఉపాధ్యాయులు, పట్టణానికి చెందిన పలువురు కూటమి నేతలు పాల్గొన్నారు.

డొంకరోడ్డు మరమ్మతు పనులకు మోక్షం

- ఎమ్మెల్యే జూలకంటి చొరవతో రూ.10 లక్షలు కేటాయింపు

రెంటచింతల,అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): నాలుగు దశాబ్దాలనుంచి ఎలాంటి మరమ్మతులకు నోచుకోని డొంకరోడ్డు ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి చొరవతో మోక్షం లభించింది. రెంటచింతలలోని డొంకరోడ్డుకి ఓ వైపు ఆర్‌సీఎం చర్చి మరోవైపు లూథరన్ చర్చీలు వున్నాయి. అయితే ఆ రోడ్డు చెత్తచెదారం, గుంతలతో ఎంతో అధ్వానంగా ఉండేది. ఎన్నికల సమయంలో ఆ మార్గం వైపు వెళ్లిన బ్రహ్మానందరెడ్డి ఆ అధ్వాన రహదారిని పరిశీలించారు. 150 మీటర్ల పొడవు, 3.75 మీటర్ల వెడల్పుండే ఈ రోడ్డు మరమ్మతులకు ప్రభుత్వం ఇటీవల ఉపాధి హామి నిధులు రూ.10 లక్షలు కేటాయించింది. దీంతో స్థానికులు ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి చొరవ, కృషితోనే తమకు మంచి జరిగిందని చెబుతూ ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు చెబుతున్నారు.

కార్యకర్తలకు అండగా టీడీపీ

పెదకూరపాడు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కార్యకర్తలకు అండగా ఉంటుందని మండల టీడీపీ అధ్యక్షుడు అర్తిమళ్ళ రమేష్ అన్నారు. మండలంలోని గారపాడులో సోమవారం టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ శాశ్వత సభ్యత్వం తీసుకున్న కార్యకర్తతో పాటు ప్రతి టీడీపీ ప్రమాద బీమా రూ.2లక్షల నుంచి రూ.5లక్షలకు పెంచిందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు బెల్లంకొండ రామగోపాలరావు, గల్లా బాబూరావు, డిస్ట్రిబ్యూటరీ కమిటీ మాజీ ఛైర్మన్ వడ్లమూడి అప్పారావు, మండల టీడీపీ నేతలు పాల్గొన్నారు.

వంగవీటి రంగా విగ్రహం ధ్వంసం

మాచవరం, అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేమవరం గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి వంగవీటి మోహన రంగా విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. విగ్రహం కుడిచేతి వెనుక వైపు, తల మీద రాడ్డుతో కొట్టిన ఆనవాళ్ళు కన్పిస్తున్నాయి. కుడి చేతి భుజం వైపు కొట్టడంతో పెచ్చులూడి కింద పడిపోయాయి. టీడీపీ, జనసేన నేతలు ఈ ఘటనను ఖండించారు. ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడినవారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని పోలీసులను కోరారు. ఎస్ఐ సతీష్ ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

సీసీ రోడ్డును పరిశీలించిన అధికారులు

వెల్దుర్తి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మండాది గ్రామంలో రూ. 15 లక్షలతో నూతనంగా ఏర్పాటు చేస్తున్న సీసీ రోడ్డును సోమవారం పంచాయతీ రాజ్ అధికారులు పరిశీలించారు. పంచాయతీ రాజ్ డీఈ విభీషణ మాట్లాడుతూ మండల పరిధిలో 25 గ్రామాల్లో నూతనంగా సిమెంట్ రోడ్లు ఏర్పాటుకు రూ. 3.09 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. డిసెంబరు ఆఖరికి రోడ్లనిర్మాణాలు పూర్తి చేయనున్నట్లు తెలిపారు. ఆయనవెంట పంచాయతీరాజ్ ఏఈ శ్రీనివాసరెడ్డి, టీడీపీ నేత గుజ్జుల పాపిరెడ్డి తదితరులు ఉన్నారు.

నూతన మోటార్లు ఏర్పాటు

కారంపూడి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కారంపూడిలో మూడు ప్రాంతాల్లో మోటార్లు కాలిపోవడంతో ప్రజలు మంచినీటి సమస్యను ఎదుర్కొన్నారు. సోమవారం టీడీపీ నేతలు, పంచాయతీ అధికారులు కాలిపోయిన మోటార్లను పరిశీలించి వాటి స్థానంలో నూతన మోటార్లను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కటికల బాలకృష్ణ, మైనార్టీనేత మస్తాన్‌వలి, అధికారులు పాల్గొన్నారు.

ఐటీపై అవగాహన అవసరం

కారంపూడి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(ఐటీ)పై అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి అన్నారు. స్థానిక బ్రహ్మనాయుడు హైస్కూల్లోని విద్యార్థులకు కంప్యూటర్ ఆపరేటర్లు రవీంద్రబాబు, రాజారాం, రామరాజులు ఐటీ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ఎం రఘుబాబు, ఒకేషనల్ ఉపాధ్యాయుడు వంశీ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు

బెల్లంకొండ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మన్నెసుల్తాన్‌పాలెం గ్రామంలో సోమవారం టీడీపీ సభ్యత్వనమోదు కార్యక్రమాన్ని టీడీపీ నేత, మండల ఫైవ్ మేన్ కమిటీ సభ్యుడు అక్కల వెంకట రామిరెడ్డి ప్రారంభించారు. 20మంది సభ్యత్వాన్ని పొందారు. కార్యక్రమంలో టీడీపీనేతలు వెంకటేశ్వర్లు, వెంకటరావు పాల్గొన్నారు.

విజిలెన్స్ వారోత్సవాలు

మాచర్లటౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్‌కేబీఆర్ డిగ్రీ కళాశాలలో సోమవారం మండలంలోని తాళ్లపల్లి పవర్ గ్రిడ్ ఆధ్వర్యాన విజిలెన్స్ వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అవినీతి అంతంపై అవగాహన కల్పించారు. అలాగే సాంస్కృతిక ఐక్యత, జాతీయ సంవృద్ధి అనే అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. కార్యక్రమంలో పవర్‌గ్రిడ్ డివిజన్ మేనేజర్ దివాకర్, కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మికుమారి, అధ్యాపకులు పాల్గొన్నారు.

బాణాసంచా దుకాణంలో తనిఖీ

సత్తెనపల్లి రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధూళిపాళ్ళ సమీపంలో గల విఘ్నేశ్వర ఫైర్ వర్క్స్ (బాణాసంచా దుకాణం)ను సత్తెనపల్లి ఆర్డీవో రమకాంత్‌రెడ్డి, తహసీల్దార్ కేఎస్ చక్రవర్తిలు సోమవారం తనిఖీ చేశారు. దుకాణ లైసెన్స్ రెన్యువల్ పత్రాలను, బాణాసంచా స్టాక్‌ను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యాపారులు ప్రభుత్వ నియమ నిబంధనలు పక్కాగా పాటించాలని, అనధికార బాణ సంచా విక్రయించినా, నిల్వ చేసినా చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే దుకాణం వద్ద ఏ విధమైన ప్రమాదాలు జరుగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రధానంగా ఫైర్‌సేఫ్టీ అందుబాటులో ఉంచుకోవాలని ఆర్డీవో రమాకాంత్‌రెడ్డి, తహసీల్దార్ కేఎస్ చక్రవర్తిలు బాణాసంచా దుకాణదారులకు సూచించారు.

బెదిరించి రూ.10 లక్షలు తీసుకున్నారు

- పల్నాడు ఎస్పీకి ఫిర్యాదు చేసిన బాధితుడు

సత్తెనపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌కు చెందిన డాన్ కైసర్‌భాయ్ పేరుచెప్పి బెదిరించి తెలంగాణాకు చెందిన రౌడీ షీటర్లు తన వద్ద నుంచి రూ.10 లక్షలు తీసుకున్నారని పట్టణానికి చెందిన క్యాసినో ఈవెంట్ నిర్వాహకుడు ఎలినేడి శ్రీనివాస్ సోమవారం గ్రీవెన్స్‌లో ఎస్పీకి ఫిర్యాదుచేశాడు. ఈ విషయంపై శ్రీనివాస్ విలేకరులతో మాట్లాడుతూ హైదరాబాద్‌కు చెందిన కత్తి వీరన్న గౌడ్, సాయి అనే వ్యక్తులతో కలసి ఇటీవల గోవాలో తాను ఒక ఈవెంట్‌ని నిర్వహించానన్నారు. ఈవెంట్ ముగిసిన అనంతరం తనకు రూ.40 లక్షలు వరకు వీరన్న గౌడ్, సాయిలు చెల్లించాల్సి ఉంటే చెల్లించలేదని, ఈవిషయమై వారితో మాట్లాడితే కైసర్‌భాయ్‌కి రూ.15లక్షలు ఇస్తేనే వారు తనకు రూ.40లక్షలు ఇస్తామని అన్నారు. ఈనెల 22న కైసర్ భాయ్ మనుషులుగా చెప్పుకుంటూ సత్తెనపల్లి వచ్చిన వారికి రూ.10లక్షలు అందజేశానని తెలిపారు. అయినప్పటికీ వీరన్నగౌడ్, సాయిలు తనకు రూ.40లక్షలు ఇవ్వకుండా చంపుతామని బెదిరిస్తున్నారని శ్రీనివాసరావు ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఎమ్మెల్సీ ఓటుకు దరఖాస్తు చేసుకోండి

నకరికల్లు, అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): పట్టభద్రులందరూ ఎమ్మెల్సీ ఓటు నమోదుకు దరఖాస్తు చేసుకోవాలని టీడీపీ సీనియర్ నేత ఎం.రామచంద్రరరావు కోరారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో జీ.కాశయ్యతో కలసి సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాల్లోని ఉద్యోగులందరూ ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకునేలాచూడాలని ఆయన కోరారు.

రహదారిపై మొసలి సంచారం

మాచవరం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : రాత్రి సమయాల్లో మొసళ్ళు ఆర్అండ్‌బీ రోడ్డు పై సంచరిస్తుండటంతో ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్త చేస్తున్నారు. ఆదివారం అర్ధరాత్రి వేమవరం సమీపంలోని ఆర్అండ్‌బీ రోడ్డుపై మొసలి రోడ్డు దాటుతూ స్థానికులకు కనిపించింది. ఈ విషయాన్ని వేమవారం ఫారెస్టు బీట్ అధికారి వెంకటేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లగా మొసలిని బంధించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

నాసా సిఫారసు చేసిన 10 ఇండోర్ మొక్కలు

అమెరికాకు చెందిన నాసా శాస్త్రవేత్తలు పలు అధ్యయనాలు చేసి గృహ కాలుష్యాన్ని తగ్గించేందుకు 10 రకాల మొక్కలను ఇళ్లలో పెంచితే ప్రయోజనం ఉంటుందని తేల్చారు. ప్రపంచ ఆరోగ్య సంస్థతో కలిసి అమెరికాలోని జార్జియా విశ్వవిద్యాలయం చేసిన అధ్యయనంలో ఇళ్లలో మొక్కలు పెంచడం వల్ల మానసిక ఒత్తిడి తగ్గుతుందని తేలింది. కార్యాలయాల్లో వాటిని పెంచడం వల్ల ఉద్యోగుల్లో పని సామర్థ్యం కూడా పెరుగుతుందని తేల్చింది.

అలోవెర (కలబంద)



ఈ మొక్క విరివిగా లభిస్తుంది. గాలిలో ఉండే బెంజిన్‌ను చాలా వరకు తగ్గిస్తుంది. రంగులు, ఇంటిని శుభ్రపరిచే వివిధ రకాల రసాయనాల్లో బెంజిన్ ఉంటుంది. ఇది కేన్సర్ కారకం.

స్పైడర్ ప్లాంట్



ఇది రెండు రోజుల్లో పెరుగుతుంది. గాలిలోని 90 శాతం విషపదార్థాలను తొలగిస్తుంది. అలర్జీ కలిగించే బ్యాక్టీరియా, వైరస్‌లను శోషణం చేసుకుంటుంది. కార్బన్ మోనాక్సైడ్ రసాయనాల ద్వారా వచ్చే ఫార్మల్‌డీహైడ్‌లను పీల్చుకుంటుంది.

క్రిశాంతిమమ్ (చామంతి)



ఇది అందరికీ తెలిసిన సువాసన భరితమైన పుష్పాలను ఇచ్చే మొక్క. కానీ చాలా మందికి తెలియని ముఖ్యమైన సుగుణం దీనికి ఉంది. ఇది ప్లాస్టిక్, జిగురు, సబ్బుల్లోని బెంజిన్ రసాయనాన్ని శోషించుకుని గాలిని శుభ్రపరుస్తుంది.

మొక్కే ఆయుధం

గృహ కాలుష్యంపై పోరాటానికి ఇండోర్ మొక్కలు

పెంపకంపై పెరుగుతున్న ఆసక్తి

కాలుష్య భయంతో నగరవాసుల అప్రమత్తం

ఇంటా బయటా అంతా కాలుష్యమే.. ఆరోగ్యాన్ని దెబ్బతీసే కాలుష్యంపై యుద్ధానికి పచ్చని మొక్కే ఆయుధం. రహదారులపైన, నివాస ప్రాంతాల్లో, ఇంటి ప్రాంగణంలో మనం పచ్చదనం పరిస్తే చాలు. కాలుష్యంపై అదే యుద్ధం చేస్తుంది. అరు బయట సరే.. మరి నట్టింట్లో తిష్టవేసే కాలుష్యం మాటేమిటి? అంటే దీనికి సమాధానం మొక్కే. ఇంట్లోని ఎలక్ట్రానిక్ పరికరాలు, మనం ఉపయోగించే డిటర్జెంట్లు, క్లీనింగ్ లిక్విడ్స్ నుంచి వెలువడే కాలుష్యం, కంటికి కనిపించని బ్యాక్టీరియా వీటన్నింటినీ తరిమికొట్టేది కూడా మొక్కే. ఇందుకు ఎన్నో ఇండోర్ మొక్కలు ఉన్నాయి. ఇంట్లోనే వాటిని అందమైన కుండీల్లో అమర్చుకుంటే ఇంటికి అందమే కాదు.. ఇంట్లోని వారి ఆరోగ్యానికీ మంచిదే.



తెనాలి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి) : పట్టణాలు, పల్లెల్లో నానాటికీ పెరుగుతున్న కాలుష్యంతో జిల్లా వాసులు అప్రమత్తమవుతున్నారు. ప్రధాన కూడళ్లతోపాటు ఇళ్ల పరిసరాల్లోనూ కలుషిత వాయువులు విస్తరిస్తుండటంతో ప్రజలు ఇండోర్ మొక్కల పెంపకంపై మక్కువ చూపుతున్నారు. వ్యాపార సంస్థలు తమ కార్యాలయాల్లోనూ వీటిని గణనీయంగా పెంచుతున్నాయి.

రోడ్డుపైనే కాదు కనీసం ఇంట్లోనైనా స్వచ్ఛమైన గాలి పీల్చుకుందామంటే అది కూడా లభించని పరిస్థితి. దైనందిన జీవితంలో ఉపయోగించే వాషింగ్ మెషీన్లు, రిఫ్రిజిరేటర్లు, ఫ్యాన్‌లు, సోఫాలు, దుప్పట్లు ఇతర చెక్క వస్తువులు హానికర రసాయనాలను విడుదల చేస్తున్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. సోఫాల్లోని స్పాంజిల్లో.. చెక్క వస్తువులకు వాడే వార్నిష్, దుప్పట్లు ఇతర వస్త్రాల్లో పేరుకుపోయిన ధూళి కణాలు, యంత్రాల నుంచి వెలువడే వాయువులు మనిషి జీవన ప్రమాణాలను దెబ్బతీస్తున్నాయని అధ్యయనాలు చెబుతున్నాయి. ఈ దుష్పరిణామాలను సమర్థంగా ఎదుర్కొనే సత్తా మొక్కలకు మాత్రమే ఉంది. సరైన మొక్కలను ఇంట్లో పెంచుకుంటే స్వచ్ఛమైన ప్రాణవాయువును ఉచితంగా పొందవచ్చు. తక్కువ ఖర్చుతో విలువైన ఆరోగ్యాన్ని పొందవచ్చు. రసాయనాలు, ఇతర కాలుష్య కారకాలను శోషించుకుని స్వచ్ఛమైన గాలినిచ్చే ఇండోర్ మొక్కల పెంపకం సులభమే. ఇళ్ల, కార్యాలయాల గదుల మూలల్లో, కిటికీల్లో మరుగుదొడ్ల వద్ద, ఇంటి గడప ముందు వాటిని ఉంచితే అందంతోపాటు ఆరోగ్యాన్ని ఇస్తాయి. రెండు రోజులకోసారి వాటికి కాసిన్ని నీళ్లు పోస్తే సరిపోతుంది.

పీస్ లిల్లీ



ఇది గాలిలో స్వచ్ఛతను 60 శాతం పెంచుతుంది. గాలిలో ఉండే కొన్ని బ్యాక్టీరియాలను ఆకుల ద్వారా శోషణం చేసుకుని ఆహారంగా వినియోగించుకుంటుంది. ఆల్కహాల్, ఆసిటోన్ తదితరాల నుంచి వచ్చే హానికర వాయువులను పీల్చుకుంటుంది.

బోస్టన్ ఫెర్న్



ఈ మొక్క నుంచి తేమ అధికంగా వెలువడుతుంది. పొడి చర్మం ఉన్నవారికి ఇది మేలు చేస్తుంది. బుట్టలో ఉంచి దీన్ని వేలాడదీస్తే ఇంటి అందం కూడా ఇనుమడిస్తుంది. రోజూ నీళ్ల పోయడంతోపాటు ఈ మొక్కకు సూర్యకాంతి కూడా తగలాలి.

యూకలిప్టస్



ఇది అన్ని రకాల రుగ్మతలపై పనిచేసే మొక్క. దీని ఆకుల నుంచి వచ్చే వాసనల వల్ల మనలో ఆరోగ్యకర ద్రవాలు పెరుగుతాయి. దీని ఆకుల పరిమళాన్ని, దీని నుంచి తయారైన ఆయిల్స్ పీల్చడం వల్ల జలుబు, ఇతర ముక్కు, గొంతు సంబంధ ఇబ్బందులు తొలగిపోతాయి.

స్నేక్ ప్లాంట్ (పాము చెట్టు)



మరుగు దొడ్లు, స్నానపు గదులు ఇతర దుర్వాసన వెదజల్లే ప్రదేశాల్లో వీటిని పెంచడం వల్ల చెడు వాసనల నుంచి విముక్తి పొందవచ్చు.

తులసి



నిరంతరాయంగా కార్బన్ డైయాక్సైడ్‌ను పీల్చుకుని ఆక్సిజన్‌ను విడుదల చేస్తుంటుంది. వీటితోపాటు జర్బర్ డైసీ, ఎరికపామ్ వంటి పలు రకాల ఇండోర్ మొక్కలను ఇంట్లోని గాలిని శుభ్రపరుచుకునేందుకు పెంచుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు.

ఇంగ్లిష్ ఐవీ



పెంపుడు జంతువులు పెంచుకునే వారిళ్లలో దీన్ని పెంచడం మంచిది. పెంపుడు జంతువుల ద్వారా గాలిలో వ్యాపించే బ్యాక్టీరియాను తగ్గిస్తుంది. ఇంటిని మరుగుదొడ్ల తదితరాలను శుభ్రం చేసే రసాయనాలు, ఫర్నీచర్ నుంచి ఫార్మల్ డీహైడ్ వెలువడుతుంది. ఈ మొక్క వాటిని తగ్గిస్తుంది. కార్యాలయాల్లో వినియోగించే సామగ్రి నుంచి బెంజిన్ వెలువడుతుంది. అందు వల్ల బల్లలపై ఈ మొక్క ఉంచుకోవడం మంచిది. ఇది ఔషధ మొక్క. వాపులు, నరాల నొప్పులకు వీటి ఆకులను ఉపయోగిస్తారు. అలాగే మలమూత్ర వ్యర్థాల నుంచి గాలిలోకి విడుదలయ్యే కణాలను, వాసనను శోషించుకోవడం దీని ప్రత్యేకత.

హార్ట్ లీఫ్ ఫిడోడెన్‌డ్రన్



ఈ మొక్క విషపూరితం. అందువల్ల పిల్లలు, పెంపుడు జంతువులు లేని ఇళ్లలో పెంచుకోవాలి. ఇది పైకి అల్లుకుపోతుంది. గాలిలో ఉండే ఫార్మల్ డీహైడ్‌ను బాగా తగ్గిస్తుంది.

ఆఫ్రికన్ వయోలెట్స్



ఇది ప్రాణవాయువును అధికంగా విడుదల చేస్తుంది. అందువల్ల మెదడుకు ప్రాణవాయువు బాగా సరఫరా అయి మనిషి విశ్రాంతి పొందుతాడు.

చైనీస్ ఎవర్‌గ్రీన్



ఇంటిని శుభ్రం చేసేందుకు వినియోగించే వివిధ రకాల రసాయనాల్లో ఉండే విషపూరిత వాయువులను తొలగిస్తుంది. ఇది ఎంత పెరిగితే అంత ప్రయోజనాన్ని ఇస్తుంది.

రాష్ట్రాన్ని పర్యాటక హబ్‌గా మారుస్తాం


● పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్

గుంటూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ సహకారంతో స్వదేశీ దర్శన్, ప్రసాద్ స్కీంల ద్వారా రాష్ట్రాన్ని పర్యాటక హబ్‌గా మారుస్తామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. సోమవారం సాయంత్రం గుంటూరుకు వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడారు. పర్యాటక ప్రాజెక్టులకు సంబంధించి ఇప్పటికే డీపీఆర్‌లు సమర్పించామని, సానుకూల నిర్ణయం వస్తుందని ఆశిస్తున్నామన్నారు. టూరిజం సర్క్యూట్‌ల ద్వారా సత్ఫలితాలు సాధిస్తామన్నారు. సూర్యలంక, కాకినాడ, రామాపురం, మైపాడు బీచ్‌లను అభివృద్ధి చేస్తామని, వీటిని బ్లూ ఫ్లాగ్ బీచ్‌లుగా రూపాంతరం చెందేలా కృషి చేస్తామన్నారు. నవంబరు 9న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నంద్యాల జిల్లా శ్రీశైలంలో సీ ప్లేన్ ప్రారంభిస్తారని మంత్రి తెలిపారు. 974 కిలోమీటర్ల విశాల సముద్ర తీరంలో వాటర్ యాక్టివిటీస్ ప్రవేశపెడతామన్నారు. ఇటీవలే తూర్పు గోదావరి జిల్లాలో ఒక రోజు ఆధ్యాత్మిక యాత్ర ప్యాకేజీని ప్రారంభించామని, దీనికి మంచి ఆదరణ లభించిందన్నారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తామన్నారు. విజయవాడలో వరదలకు దెబ్బతిన్న భవానీ ఐలాండ్‌ను పునరుద్ధరిస్తామని, వైజాగ్ రుషికొండపై జగన్ తన అవసరాలకు తగినట్లుగా భవనాలను నిర్మించుకొన్నారని, అవినీతికి పరాకాష్టగా అవి నిలుస్తాయన్నారు. త్వరలోనే సామాన్య ప్రజానీకానికి అవసరం అయ్యేలా దాన్ని వినియోగించేలా చర్యలు తీసుకుంటామన్నారు. అటవీ, దేవదాయ, పర్యాటక శాఖలతో కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు అయిందని సమన్వయముతో ముందుకెళ్లి పర్యాటకాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. జలవనరులు శాఖ మంత్రి కూడా సబ్ కమిటీకి తోడైతే బాగుండేది అని మంత్రి అభిప్రాయం వ్యక్తం చేశారు.


ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్‌గా రమణ యశస్వి

● వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా సుందరాచారి

● ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం



డాక్టర్ రమణ యశస్వి



డాక్టర్ సుందరాచారి

గుంటూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రి నూతన సూపరింటెండెంట్‌గా ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ రమణ యశస్వి నియమితులయ్యారు. ఆర్థోపెడిక్ విభాగాధిపతిగా జీజీహెచ్‌లోనే ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న ఆయనకు ప్రభుత్వం ఉద్యోగోన్నతి కల్పించి ఇక్కడే సూపరింటెండెంట్‌గా నియమించింది. ప్రస్తుత జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా ఉన్న డాక్టర్ యేకుల కిరణ్‌కుమార్‌ను ఇదే ఆసుపత్రిలో జనరల్ సర్జరీ వైద్య విభాగాధిపతిగా నియమించారు. మచిలీపట్నం వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్న న్యూరాలజీ ప్రొఫెసర్ డాక్టర్ ఎన్‌వీ సుందరాచారిని గుంటూరు వైద్య కళాశాల నూతన ప్రిన్సిపాల్‌గా బదిలీ చేశారు. ప్రస్తుతం జీఎంసీ ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్న ఫోరెన్సిక్ మెడిసిన్ ప్రొఫెసర్ డాక్టర్ టీటీకే రెడ్డిని మచిలీపట్నం మెడికల్ కాలేజీకి బదిలీ చేశారు. ఈ మేరకు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు సోమవారం ఆదేశాలు జారీ చేశారు. పాలనపరమైన సౌలభ్యం కోసం రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రభుత్వ వైద్య బోధన ఆస్పత్రుల సూపరింటెండెంట్లు, వైద్య కళాశాల ప్రిన్సిపాళ్లను నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. గుంటూరు జీజీహెచ్, జీఎంసీతో పాటు విజయవాడ, కర్నూలు ప్రభుత్వాస్పత్రుల సూపరింటెండెంట్లను కూడా మార్చారు. ప్రస్తుతం ప్రభుత్వాస్పత్రిలో కోట్లాది రూపాయలతో పలు వార్డుల అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. వీటిని త్వరితగతిన పూర్తి చేసేందుకు తన వంతు ప్రయత్నం చేస్తానని డాక్టర్ రమణ యశస్వి తెలిపారు. డాక్టర్ సుందరాచారి వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టడంతో సీఎంఈ, ఇతర అకడమిక్ కార్యక్రమాలు చురుగ్గా సాగుతాయని వైద్యవర్గాలు భావిస్తున్నాయి.

అన్నప్రాసన నాడే...

ఆవకాయ పెట్టమంటే ఎలా?

● కూటమి ప్రభుత్వం వచ్చి నాలుగు నెలలే అయింది

● ఇంత తక్కువ సమయంలో ఎన్నో మంచి పనులు చేశాం

● జిల్లా సమీక్ష మండలి సమావేశంలో ఇన్‌ఛార్జ్ మంత్రి దుర్గేష్

● మీటింగ్‌లో ఎమ్మెల్సీ లక్ష్మణరావు, ఎమ్మెల్యే నరేంద్ర మధ్యన స్వల్ప వాదన

గుంటూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): అన్నప్రాసన నాడే ఆవకాయ పెట్టమంటే ఎలా అని రాష్ట్ర పర్యాటక, జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి కందుల దుర్గేష్ నొచ్చుకొన్నారు. గత వైసీపీ ప్రభుత్వం పింఛన్‌ని రూ. వెయ్యి పెంచడానికి ఐదేళ్ల సమయాన్ని తీసుకొన్నది. అలాంటిది కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 13 రోజుల్లోనే రూ. వెయ్యి పెంచి క్రమం తప్పకుండా ప్రతీ నెల ఒకటో తేదీన పంపిణీ చేస్తున్నది. పింఛన్ సొమ్ము పొందుతున్న లబ్ధిదారుల కళ్లల్లో కనిపిస్తున్న ఆనందం మాటల్లో చెప్పలేనిదన్నారు. అంతేకాకుండా ఈ నాలుగు నెలల వ్యవధిలో ఎన్నో చేశాం. రాబోయే ఐదేళ్లలో మరింత మేలు చేయడమే తమ లక్ష్యమని అన్నారు. సోమవారం సాయంత్రం గుంటూరు జిల్లా కలెక్టరేట్‌లో ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రప్రథమంగా జిల్లా సమీక్ష మండలి సమావేశం ఇన్‌ఛార్జ్ మంత్రి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పలు సమస్యలను లేవనెత్తారు. వాటిపై ఇన్‌ఛార్జ్ మంత్రి స్పందించి పైవ్యాఖ్యలు చేశారు.

సమావేశంలో ఎమ్మెల్సీ లక్ష్మణరావు, పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ మధ్యన కూడా సంభాషణ ఆసక్తికరంగా సాగింది. కౌలు రైతులకు రుణాల అంశం చర్చకు వచ్చినప్పుడు తాను కొన్నేళ్లుగా పోరాడుతున్నానని లక్ష్మణరావు అన్నారు. కౌలురైతుల చట్టం గత కొన్ని సంవత్సరాల క్రితమే వచ్చిందని అయితే ఇప్పటివరకు ఏ కొద్దిమందికో తప్పితే ఎక్కువమందికి ఎలాంటి మేలు జరగలేదన్నారు. పేరుకు 44 వేలకు పైగా కౌలుదారులకు కార్డులు ఇస్తున్నప్పటికీ బ్యాంకర్లు రుణాలు ఇవ్వడం లేదని చెప్పారు. గత ప్రభుత్వం భూయజమాని సమ్మతి ఉండాలన్న నిబంధన చేర్చిందన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం త్వరలో తీసుకురాబోతున్న నూతన చట్టంపై సమావేశం నిర్వహించినప్పుడు బ్యాంకర్లను ప్రిన్సిపల్ సెక్రెటరీ బతిమాలారని, ఇది ఎంతవరకు సబబని ప్రశ్నించారు. ఈ వ్యాఖ్యలపై పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యే నరేంద్ర విభేదించారు. నూతన చట్టంలో కేవలం ఈ-క్రాప్ బుకింగ్ పైనే రుణాలు ఇవ్వాల్సిందిగా బ్యాంకర్లను ఆదేశించామన్నారు. దీని వలన భూయజమాని సమ్మతితో పని లేదని చెప్పారు. తప్పక కౌలురైతులకు మేలు చేస్తామన్నారు. ఎమ్మెల్యే నరేంద్ర మాట్లాడుతూ కౌలు రైతుల సమస్యలపై మీరే పోరాటం చేస్తున్నారన్న పేటెంట్ హక్కు కావాలంటే తీసుకోండి. వారి సమస్యలపై మాట్లాడేందుకు మాకు భయం అని మీరు వ్యాఖ్యలు చేయడం సరికాదు. అందరి హక్కులను కాపాడటం మా బాధ్యత అని జవాబిచ్చారు.



ఇన్‌ఛార్జి మంత్రి కందుల దుర్గేష్ సమక్షంలోనే ఎమ్మెల్సీ లక్ష్మణరావు, ఎమ్మెల్యే నరేంద్ర మధ్య వాగ్వాదం

ఇదే రీతిన గుంటూరు చానల్‌పై స్వల్పకాలిక చర్చ జరిగిన సందర్భంలోనూ ఎమ్మెల్సీ లక్ష్మణరావు, ఎమ్మెల్యే నరేంద్ర మధ్య మాటకు మాట జరిగింది. గత 50 ఏళ్లగా డాక్టర్ కొల్లా రాజమోహన్ పోరాటం చేస్తున్నారని, భూసేకరణకు అవసరమైన రూ. 104 కోట్లు విడుదల చేసే ప్రయత్నం ఏమైనా చేస్తారా అని ఎమ్మెల్సీ లక్ష్మణరావు ప్రశ్నించారు. దీనిపై ఎమ్మెల్యేలు నరేంద్ర, బూర్ల రామాంజనేయులు స్పందిస్తూ గుంటూరు ఛానల్ పొడిగింపు, ఆధునికీకరణ పనులను గత టీడీపీ ప్రభుత్వమే మంజూరు చేసిన విషయాన్ని గ్రహించాలన్నారు. ఇరిగేషన్ సమస్యలు ఈనాటివి కాదని, మనం పుట్టకముందు నుంచి ఉన్నాయని చెప్పారు.

ఓ రౌడీషీటర్‌కు గన్‌మెన్ సౌకర్యమా...?

● అడ్డగోలుగా వ్యవహరించిన నాటి ఇంటిలిజెన్స్ అదనపు డీజీ పీఎస్సార్ ● ఏడాది పాటు రెచ్చిపోయిన రౌడీషీటర్ బోరుగడ్డ

గుంటూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : గత ప్రభుత్వ హయాంలో చట్టం అధికార పార్టీ నేతలకు, కొందరు ఐపీఎస్‌లకు చుట్టంగా మారింది అనడానికి ఇది మరో ఉదాహరణ. చట్ట నిబంధనలకు విరుద్ధంగా ఏకంగా ఓ రౌడీషీటర్‌కు గన్‌మెన్ సదుపాయం కల్పించిన ఘనత నాటి వైసీపీ ప్రభుత్వానికే దక్కింది. బాస్ ఆదేశించారు నేను అమలు చేశాను అన్నట్లుగా అధికార వైసీపీ నాయకులు ఏది చెబితే అది తోక ఊపుతూ అమలు చేసిన నాటి ఇంటిలిజెన్స్ అదనపు డీజీ పి సీతారామాంజనేయులు తాజాగా మరో వివాదంలో చిక్కుకున్నారు. ఇప్పటికే ఆయన వైసీపీ హయాంలో ఎంపీగా వున్న రఘురామకృష్ణరాజుపై కస్టోడియల్ టార్చర్ కేసులో రెండో నిందితునిగా ఉన్న విషయం విధితమే. గుంటూరులోని నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసులో పి సీతారామాంజనేయులు ఏ2గా ఉన్నారు. ఈ కేసులో ఏ1గా పీవీ సునీల్ కుమార్, ఏ3గా జగన్మోహన్‌రెడ్డి ఉన్న విషయం విధితమే. అదేవిధంగా విజయవాడలో సినీనటి జత్వానీ కేసులోనూ పిఎస్ఆర్ ఏ2 నిందితునిగా ఉన్నారు. నిబంధనలను అతిక్రమించి గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇంటిలిజెన్స్ అదనపు డీజీగా ఉన్న సీతారామాంజనేయులు అడ్డగోలుగా వ్యవహరించారు. నాటి సీఎం జగన్, నాటి ప్రభుత్వ ప్రధాన సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి ఆదేశిస్తే అది చేసేశారు. నిబంధనలను ఏమాత్రం పాటించలేదు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అడ్డుగోలుగా తీసుకున్న నిర్ణయాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. తాజాగా రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్ కుమార్‌కు గన్‌మెన్ సదుపాయం కల్పించాలని నాటి ఇంటిలిజెన్స్ అదనపు డీజీ సీతారామాంజనేయులు తీసుకున్న నిర్ణయం ప్రస్తుతం కలకలం రేపుతోంది. సాధారణంగా ఒక వ్యక్తికి గన్‌మెన్ సదుపాయం కల్పించాలన్నా లేదంటే, గన్ లైసెన్స్ ఇవ్వాలన్నా అనేక నిబంధనలు ఉన్నాయి. సంబంధిత వ్యక్తులు తమకు ప్రాణహాని ఉన్నట్లు తగిన ఆధారాలతో జిల్లా ఎస్పీకి గానీ డీజీపీకి గాని ఇంటెలిజెన్స్ డిజికి గాని దరఖాస్తు చేసుకోవచ్చు. ముఖ్యంగా మావోయిస్టుల నుంచి ముప్పు ఉంటే వారి నుంచి బహిరంగంగా వచ్చిన హెచ్చరికలకు సంబంధించిన ఆధారాలను పోలీసులు అధికారులకు సమర్పించాలి. లేదంటే ఇతర వ్యక్తుల నుంచి ఆయనకు ఏదైనా ప్రాణహాని ఉన్నట్లు వారి నుంచి బెదిరింపులు గాని లేదంటే వారు హత్యాయత్నం చేసినట్లు గాని ఎఫ్ఐఆర్‌లు ఉండాలి. దీనిపై ఇంటిలిజెన్స్ డిజి అధికారులు విచారించాల్సిందిగా జిల్లా ఎస్పీకి ఆ ఫిర్యాదును పంపుతారు. దీనిపై ఎస్పీ సంబంధిత స్పెషల్ బ్రాంచ్ వర్గాలతో ఆయనకు ప్రాణహాని ఉందా లేదా అనే విషయంలో ఆరా తీస్తారు. మరోవైపు ఇంటెలిజెన్స్ అధికారులు కూడా తమ సిబ్బందితో రహస్యంగా దర్యాప్తు చేయించి నివేదిక తెప్పించుకుంటారు. ఆయనకు ప్రాణహాని ఉందని విచారణలో తేలితే ఉన్నతాధికారులకు పంపి గన్‌మెన్ సదుపాయం కల్పిస్తారు. అయితే ఎవరినుంచైనా బెదిరింపులు వచ్చినా, ప్రాణహాని తలపెట్టే అవకాశం ఉందని అనుమానించిన సంబంధిత వ్యక్తి అభ్యర్థన మేరకు గన్‌మెన్ సౌకర్యం కల్పించాల్సి ఉందని పోలీసు శాఖ భావించిన పక్షంలో అందుకు అయ్యే ఖర్చు ఆయన నుంచే వసూలు చేస్తారు. ఒకరిని గన్‌మెన్‌గా కేటాయిస్తే షిఫ్ట్ వారీగా ఇరువురు గన్‌మెన్‌లు ఆయన వద్ద నిధులు నిర్వహించాల్సి ఉంటుంది ఒక్కో గన్‌మెన్‌కు రోజుకు రెండు వేలు చొప్పున ఇరువురికి నెలకు కనీసం లక్షా 20 వేల నుంచి లక్షన్నర వరకు సదరు వ్యక్తి చెల్లించాల్సి ఉంటుంది. ఇదే తరహాలో నాటి అదనపు అడ్వకేట్ జనరల్‌గా విధులు నిర్వహించిన పొన్నవోలు సుధాకర్ రెడ్డి కూడా గన్‌మెన్ సదుపాయం పొందారు. దీనిపై జిల్లా ఎస్పీ అభ్యంతరం వ్యక్తం చేస్తూ గన్‌మెన్ సదుపాయం తొలగించాలని ప్రభుత్వానికి లేఖ రాశారు. దీంతో పొన్నవోలు హైకోర్టుకు వెళ్లగా గన్‌మెన్ సదుపాయం తొలగించాలని హైకోర్టు ఆదేశించడంతో పొన్నవోలుకు గన్‌మెన్‌ను పోలీస్ శాఖ ఉప సంహరించుకుంది.

రౌడీ షీటర్ బోరుగడ్డకు నేరుగా..

రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్ కుమార్ విషయంలో నాటి ఇంటిలిజెన్స్ అదనపు డీజీ పీఎస్సార్ వ్యవహరించిన తీరు వివాదాస్పదంగా మారింది. కనీసం ఎటువంటి విచారణ కానీ, ఆయనకు ప్రాణహాని ఉన్నట్లు గానీ ఎటువంటి ఆధారాలు లేకుండానే ఇంటిలిజెన్స్ అదనపు డీజీ హోదాలో జిల్లా ఎస్పీకి ఉత్తర్వులు వచ్చాయి. దీంతో గత ఎన్నికలకు ముందు సుమారు ఏడాది నుంచి ఆయనకు గన్‌మెన్ సదుపాయం కల్పించారు. దీంతో బోరుగడ్డ ప్రభుత్వం కల్పించిన గన్‌మెన్ సదుపాయాన్ని పూర్తిస్థాయిలో దుర్వినియోగం చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఎన్నికల ఫలితాలు వచ్చేవరకు గన్‌మెన్లు ఉన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆయా గన్‌మెన్లు స్వచ్ఛందంగా ఎవరికి వారు వైదొలిగారు. ప్రస్తుతం అరండల్‌పేట పోలీసులు ఆయనను రాజమండ్రి సెంట్రల్ జైలు నుంచి మూడు రోజుల కస్టడీకి తీసుకువచ్చారు. బోరుగడ్డను విచారిస్తున్న సమయంలో ఆయన గన్‌మెన్ సదుపాయంపై చెప్పిన సమాధానం సర్వత్రా విస్మయాన్ని కలిగించింది. తాను సీఎంకు సలహాదారుడిని కాబట్టే తనకు గన్‌మెన్ సదుపాయం కల్పించారని బోరుగడ్డ చెప్పుకోవడం విశేషం. ఈ నేపథ్యంలోనే సజ్జల ఆదేశాలతో నాటి ఇంటిలిజెన్స్ అడిషినల్ డిజి సీతారామాంజనేయులు తనకు సదుపాయం కల్పించారని ఆయన చెప్పడం పోలీస్ వర్గాలతో పాటు రాజకీయ వర్గాల్లోనూ చర్చనీయాంశంగా మారింది.

శీతల గిడ్డంగుల లైసెన్సుల రెన్యువల్‌కు

డీఆర్‌సీ ఆమోదం

● సంబంధిత యాజమాన్యాల వద్ద అఫిడవిట్ తీసుకోవాలి

గుంటూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని శీతల గిడ్డంగుల లైసెన్సులన్నింటిని రెన్యువల్ చేయడానికి డీఆర్‌సీ ఆమోదం తెలిపింది. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో కోల్డ్‌స్టోరేజ్‌ల లైసెన్సుల రెన్యువల్ పెండింగ్ అంశం చర్చకు వచ్చింది. దీనిపై తొలుత ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ కోల్డ్‌స్టోరేజ్‌లు దశాబ్దాల క్రితమే నిర్మించారు. ఇప్పుడు వాటిల్లోకి అగ్నిమాపక శాఖ శకటం వెళ్లి చుట్టూత తిరిగే పరిస్థితి లేదు. ఈ కారణాన్ని చూపుతూ ఆ శాఖ ఎన్‌వోసీ ఇవ్వడం లేదని, దీని వలన లైసెన్సుల రెన్యువల్ జరగడం లేదన్నారు. లైసెన్సుల రెన్యువల్ జరగకపోతే రేపటి రోజున ఏదైనా ప్రమాదం జరిగితే బీమా కంపెనీలు క్లెయిమ్‌లు చెల్లించే పరిస్థితి ఉండదన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి స్పందించి కోల్డ్‌స్టోరేజ్‌లలో నిల్వ ఉంచిన రైతుల సరుకుకు యాజమాన్యాలదే పూర్తి బాధ్యత చేసి వాళ్ల వద్ద అఫిడవిట్ తీసుకొని లైసెన్సుల రెన్యువల్‌కు చర్యలు తీసుకొంటా మన్నారు. ఇందుకు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కందుల దుర్గేష్, పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ సానుకూలంగా స్పందించారు. డీఆర్‌సీ ఆమోదం దృష్ట్యా కోల్డ్‌స్టోరేజ్‌ల యాజమాన్యాల వద్ద అఫిడవిట్‌లు తీసుకొని లైసెన్సుల రెన్యువల్ ప్రక్రియని ప్రారంభించాలని మార్కెటింగ్ శాఖ ఏడీ రాజబాబుని ఆదేశించారు.

ఉచిత గ్యాస్ బుకింగ్‌కు మార్చి 31 వరకు గడువు

ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం దీపం-2లో తొలి రీఫిల్ సిలిండర్ బుకింగ్ చేసుకోవడానికి 2025 మార్చి 31వ తేదీ వరకు సమయం ఉందని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ఈ నెల 29వ తేదీ మంగళవారం నుంచి బుకింగ్స్ ప్రారంభమౌతాయని, దీని దృష్ట్యా అందరూ ఒకేసారి బుకింగ్స్ చేసుకొంటే సమస్యలు ఉత్పన్నం అయ్యే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో అవసరం ఉన్న వాళ్లే బుకింగ్ చేసుకోవాలని సూచించారు. మార్చి 31వ తేదీ లోపు ఎప్పుడు బుకింగ్ చేసుకొన్నా ఉచిత గ్యాస్ సిలిండర్ డెలివరీ జరిగిన 48 గంటల్లో నగదుని బ్యాంకు అకౌంట్‌కి జమ చేస్తామన్నారు.

హ్యాండ్‌బాల్ విజేత గుంటూరు జిల్లా



హ్యాండ్‌బాల్‌లో విజయం సాధించిన గుంటూరు జిల్లా బాల బాలికల జట్లు

తెనాలి అర్బన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి అండర్-14 బాల బాలికల హ్యాండ్ బాల్ పోటీల్లో గుంటూరు జిల్లా జట్లు విజయం సాధించాయి. తెనాలి డీఎస్ఏ స్టేడియంలో మూడు రోజుల పాటు జరిగిన పోటీలు సోమవారం ముగిశాయి. బాలుర విభాగంలో గుంటూరు జిల్లా జట్టు ప్రథమ, చిత్తూరు జిల్లా జట్టు ద్వితీయ, ప్రకాశం జిల్లా జట్టు తృతీయ స్థానం పొందాయి. బాలికల విభాగంలో గుంటూరు జట్టు ప్రథమ, కృష్ణా జట్టు ద్వితీయ, ప్రకాశం జట్టు తృతీయ స్థానాలు సాధించాయి. విజేతలకు రోటరీ క్లబ్ అధ్యక్షుడు ఈదర శ్రీనివాసరావు, కార్యదర్శి మురళీకృష్ణ బహుమతులు అందజేశారు. ఛత్తీస్‌ఘడ్‌లో నవంబరు ఆఖరి వారంలో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు ఏపీ జట్టును ఎంపిక చేశారు. టోర్నమెంట్ నిర్వహణకు డబుల్ హార్స్ సంస్థ, రోటరీ క్లబ్, స్వర్ణ హోటల్ సహకారం అందించారని స్కూల్ గేమ్స్ కార్యదర్శి ఎం.రవి కృతజ్ఞతలు తెలిపారు. హోటల్స్ అసోసియేషన్ కోశాధికారి ఈదర వెంకటపూర్ణచంద్, సుధీర్‌బాబు, రమేష్‌బాబు, వినయ్‌కుమార్, బి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా దుకాణాలకు పోలీస్ అనుమతులు తప్పని సరి: సీఐ

వినుకొండ టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) దీపావళి పండుగ సందర్భంగా అమ్మకందారులు తప్పనిసరిగా లైసెన్సులు తీసుకోవాలని పట్టణ సీఐ శోభన్‌బాబు తెలిపారు. స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పండుగ సందర్భంగా మందుగుండు సామగ్రిని పోలీస్ అనుమతులు లేకుండా విక్రయించరాదని తెలిపారు. అనుమతులు లేకుండా ఏర్పాటుచేసిన షాపులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

క్రైమ్ జోన్

ఆరుగురు జూదరుల అరెస్టు

● రూ.12వేల నగదు, పందెంకోడి స్వాధీనం

యడ్లపాడు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కోడి పందాలు ఆడుతున్న జూదరులు ఆరుగురిని యడ్లపాడు పోలీసులు అరెస్టు చేశారు. మండలం పరిధిలోని వంకాయలపాడు-కారుచోల గ్రామాల మధ్య కోడి పందాలు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో యడ్లపాడు ఎస్‌ఐ బాలకృష్ణ సిబ్బందితో కలసి దాడులు నిర్వహించారు. పోలీసులను గమనించిన కొంత మంది పారిపోగా ఆరుగురు పట్టుబడ్డారు. పట్టుబడిన వారివద్ద నుంచి రూ.12వేల నగదు, ఒక పందెం కోడిని స్వాధీనం చేసుకున్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారు ఎంతటి వారైనా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ హెచ్చరించారు.

పరస్పర ఫిర్యాదులపై కేసులు

నాదెండ్ల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిరుమామిళ్ళలో ఇద్దరి మధ్య సోమవారం ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో గాదె చలమారెడ్డి అనే వ్యక్తి గాయపడ్డాడు. గ్రామానికి చెందిన మోరా రామ్మోహన్‌రెడ్డి తనపై దాడి చేశాడని నాదెండ్ల పోలీసులకు చలమారెడ్డి సోమవారం రాత్రి ఫిర్యాదు చేశాడు. గాయపడ్డ చలమారెడ్డి నరసరావుపేట ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కాగా తనపైనే చలమారెడ్డి దాడి చేశాడని రామ్మోహన్‌రెడ్డి కూడా నాదెండ్ల పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ విషయమై ఎస్‌ఐ పుల్లారావును వివరణ కోరగా ఇరువురి ఫిర్యాదులు స్వీకరిస్తున్నామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో చిరుమామిళ్ళ గ్రామ వాసి మృతి



వేమారెడ్డి (ఫైల్‌ఫొటో)

నాదెండ్ల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిరుమామిళ్ళ గ్రామానికి చెందిన వ్యాపార వేత్త దుగ్గెంపూడి వేమారెడ్డి (36) రాజమండ్రి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో సోమవారం మృతి చెందాడు. వేమారెడ్డితో పాటు మరోవ్యక్తి వ్యాపార పనులపై రాజమండ్రి వెళ్ళి తిరిగి విజయవాడ వస్తుండగా తూర్పు గోదావరి జిల్లా నల్లజర్ల మండలం దూబచర్ల జాతీయ రహదారిపై కంటైనర్‌ను కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో వేమారెడ్డి తల తెగి మొండెం వేరైంది. గాయపడిన మరో వ్యక్తిని ఆస్పత్రికి తరలించారు. వేమారెడ్డి సాతులూరుతో పాటు పలు ప్రాంతాల్లో ప్రీకాస్ట్ అండ్ ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ పేరుతో వ్యాపారం నిర్వహిస్తున్నాడు. అతని మృతితో చిరుమామిళ్ళలో విషాదం నెలకొంది. ఆయన మృతికి గోల్కొండ గ్రూపు సంస్థల అధినేత నడికట్టు రామిరెడ్డి, యన్నం రవీంద్రారెడ్డి, శివారెడ్డి తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

15మద్యం బాటిళ్లు స్వాధీనం

నూజెండ్ల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగముక్కపల్లిలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న బెల్టు షాపుపై ఐనవోలు పోలీసులు సోమవారం దాడిచేసి 15మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన ఇసుక లక్ష్మీరెడ్డి వినుకొండ నుంచి అక్రమంగా మద్యం తీసుకువచ్చి గ్రామంలో అధిక రేట్లకు విక్రయించటంపై అందిన ఫిర్యాదు మేరకు మద్యం బెల్టు షాపుపై దాడిచేసి మద్యం స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్టు ఐనవోలు పోలీసుస్టేషన్ కానిస్టేబుల్ విల్సన్ తెలిపారు.

ఎస్పీ కార్యాలయంలో రక్తదాన శిబిరం

నరసరావుపేట లీగల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమర వీరుల సంస్మరణ దినం సందర్భంగా సోమవారం పల్నాడు జిల్లా పోలీసు కార్యాలయంలో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఎస్పీ కంచి శ్రీనివాసరావు రిబ్బన్ కత్తిరించి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు అమర వీరుల సంస్మరణ దినం సందర్భంగా రక్తదాన కార్యక్రమాన్ని నిర్వహించటం సంతోషంగా ఉందన్నారు. రక్తదానం చేసిన పోలీసులకు, యువతకు అభినందనలు తెలిపారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సౌజన్యంతో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలోని మొబైల్ నెట్ బ్యాంక్ వాహనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో డాక్టర్ జగన్ మోహన్‌రెడ్డి, ఏఆర్‌డీ ఎస్పీ మహాత్మాగాంధీ, పోలీసు అధికారులు గోపీనాథ్, యువరాజ్, కృష్ణ, రాజ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. వీరిని ఎస్పీ అభినందించారు. పరిపాలన అదనపు ఎస్పీ జేవీ సంతోష్, వైద్యులు, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నవంబరు 17 న కార్తీక వన సమారాదన

వినుకొండ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) నవంబరు 17 తేదీన శ్రీయోగి వేమారెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో నవంబరు 17వ తేదీన కార్తీక వన సమారాధన కార్యక్రమం నిర్వహిచనున్నట్లు అధ్యక్షుడు ఆరే శివారెడ్డి తెలిపారు. స్థానిక వెల్లటూరు రోడ్డులోని నియోజకవర్గం రెడ్డి సంఘం కార్యాలయంలో సంఘం పెద్దలు సోమవారం సమావేశం నిర్వహించారు. రెడ్డి సంఘంలోని నిరుపేద, మెరిట్ విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందచేయనున్నట్లు వారు తెలిపారు. స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తు చేసుకునే విద్యార్థులు నవంబరు 10 తేదీన సాయంత్రంలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. గీతమ్స్ బ్లూమ్స్, కర్నాటి చెన్న కేశవరెడ్డి కార్యాలయంలో దరఖాస్తు అందు బాటులో ఉన్నాయని తెలిపారు.

వీధి కుక్కలతో జనం బెంబేలు

● చర్యలు తీసుకోవాలని గ్రామస్థుల వినతి



ఈపూరు వీధుల్లో సంచరిస్తున్న కుక్కల గుంపు

ఈపూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): వీధి కుక్కలతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఇంటి నుంచి బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. ఇటీవల కుక్కల దాడిలో ఎంతోమంది గాయపడ్డారు. మండలంలో కొచ్చెర్ల, ఈపూరు, ఊడిజర్ల, అగ్నిగుండాల, బొమ్మరాజుపల్లి,అంగలూరు గ్రామాలలో కుక్కలు పదుల సంఖ్యలో గుంపులుగా తిరుగుతున్నాయి. కుక్కల దాడిలో పిల్లలు,పెద్దలు గాయపడిన సంఘటనలు ఉన్నాయి. నెలలో సుమారు 50మంది కుక్కల దాడిలో గాయపడుతు న్నారు. మనుషులపైనే కాకుండా పశువులు, జీవాలపైన కుక్కలు దాడులు చేసి వాటిని చంపుచున్నాయి. పొలాలకు వెళ్ళాలంటే రైతులు భయాందోళన చెందుతున్నారు. మూకుమ్మడిగా కుక్కలు దాడులు చేస్తుండడంతో బిక్కుబిక్కుమంటున్నారు. అధికారులు స్పందించి కుక్కలను పట్టించి వాటి బారినుంచి రక్షించాలని మండల ప్రజలు కోరుచున్నారు.

వారంలో 16 మందిని గాయపరిచాయి



మీసాల చిన్నప్రసాదు, ఈపూరు

వారం రోజులలోనే ఈపూరులో 16మందిని కుక్కలు తీవ్రంగా గాయపరిచాయి. వీధిలోకి రావాలంటేనే భయమేస్తుంది. పశువులను గాయపరచడంతో పాటు దూడలను చంపుతున్నాయి. కుక్కలకు తోడు కోతులు బెడద ఎక్కువైంది. అధికారులు కుక్కలు, కోతుల బారినుంచి కాపాడేందుకు చర్యలు చేపట్టాలి.

జగన్ చీకటి జీవోలన్నీ ప్రజలముందు పెడతాం

అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రత్తిపాటి



కుక్కపల్లివారిపాలెంలో అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, గ్రామస్థులు

యడ్లపాడు, చిలకలూరిపేట అర్బన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): జగన్ చీకటిపాలన రహస్యాలన్నీ త్వరలోనే ప్రజల ముందుకు రాబోతున్నాయని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. నియోజకవర్గంలోని మైదవోలు, కుక్కపల్లివారిపాలెం గ్రామాలలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే సోమవారం శంకుస్థాపనలు చేశారు. మైదవోలులో రూ.12లక్షలతో, కుక్కపల్లివారిపాలెంలో రూ.10లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు, డ్రెయిన్ల నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజచేసి, శిలా ఫలకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమార్జన కోసం అడ్డగోలుగా అర్ధరాత్రులు జీవోలు తెచ్చి ప్రజలకు తెలియకుండా గోప్యంగా ఉంచిన ప్రతి ఉత్తర్వు జనం ముందు పెట్టబోతున్నామన్నారు. గత ఐదేళ్లలో జగన్ ప్రభుత్వం తెచ్చిన చీకటి జీవోలను ఆన్‌లైన్‌లో పెట్టాలన్న ముఖ్యమంత్రి సీఎం ఆదేశాలతో జగన్‌రెడ్డి అరాచకాలు ప్రజలకు తెలియనున్నాయని, దీనితో పారదర్శక పాలనకు బీజం వేసినట్లు అవుతుందన్నారు. ప్రజలకు తెలియకుండా జీవోలు దాచిపెట్టిన ముఖ్యమంత్రి బహుశా జగన్ ఒక్కడే అయి ఉంటాడని ఎద్దేవా చేశారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో జీవోలన్నీ ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో ఉంచేవారమని, జగన్ ప్రభుత్వం మాత్రం ఆ సంప్రదాయానికి మంగళం పాడిందన్నారు. చివరకు రాష్ట్ర హైకోర్టు చీవాట్లు పెట్టి జీవోలన్నీ ఆన్‌లైన్‌లో పెట్టాలని ఆదేశాలు జారీచేసినా రహస్య పాలననే కొనసాగించాడని విమర్శించారు. ప్రజలకు మంచిచేస్తే జీవోలను ఎందుకు దాచిపెట్టుకోవాల్సి వచ్చిందో జగన్ ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. జీవోలను దాచిపెట్టి గోప్యత పాటించాల్సిన అవసరంపై వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వం లక్ష్యం

ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు



రెవెన్యూ సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

శావల్యాపురం, అక్టోబరు 28 (ఆంధ్రప్రదేశ్): గ్రామీణ ప్రాంతాల్లో నెలకొనియున్న ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని చేపట్టిందని, అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి ప్రజాసమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. శావల్యాపురం మండల పరిషత్ కార్యాలయం వద్ద ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. వివిధ గ్రామాల ప్రజలు పాల్గొని గ్రామాల్లోని సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. ప్రజాదర్బార్‌లో రెవెన్యూ శాఖకు 52, గృహ నిర్మాణశాఖకు 45, పంచాయతీరాజ్‌కు 32 దరఖాస్తులు వచ్చాయి. ఎమ్మెల్యే జీవీ మాట్లాడుతూ అధికారులు అంకితభావంతో పనిచేసినప్పుడే ప్రజల మన్ననలు పొందుతారని, తమ పరిధి దాటిన సమస్యలను జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళి వెంటనే పరిష్కరించేలా కృషి చేయాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. వైసీపీ ప్రభుత్వం నిర్వహించిన రీసర్వే తప్పుల తడకగా మారడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, రీసర్వేలో నమోదైన తప్పులకు రైతులు ఎటువంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేకుండా సవరణలు చేయాలని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను ఫోన్‌లో కోరారు. రీసర్వే సమస్యలను వీఆర్వోలు, విలేజ్ సర్వేయర్‌లు బాధ్యతగా తీసుకొని సవరణలను త్వరగా పూర్తిచేయాలన్నారు. ఎన్టీఆర్ కాలనీలు ఏర్పాటు చేసి గ్రామాల్లోని పేదలకు 3సెంట్లు చొప్పున స్థలాన్ని కేటాయించి, ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం ద్వారా గృహ నిర్మాణాలు చేయిస్తామన్నారు. గతంలో ఇళ్ళు కట్టుకొని బిల్లులు రాని వారికి వెంటనే చెల్లిస్తామన్నారు. శావల్యాపురం జడ్పీ పాఠశాల ఆవరణలో వర్షం కురిసిన ప్రతిసారీ నీరు నిలబడి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, ఆవరణకు మెరక తోలించాలని పీఎంసీ చైర్మన్ శ్రావణ్ కుమార్, హెచ్‌ఎం విజయలక్ష్మి, స్టాఫ్‌సెక్రటరీ బీవీ నాగేశ్వరరావు ఎమ్మెల్యేని కోరగా త్వరలో పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు గుంటూరు సాంబశివరావు, నాయకులు యరమాసు కోటేశ్వరరావు, గడిపూడి విశ్వనాధం, బొల్లా పేరయ్య, దొడ్డా ఏడుకొండలు, గోపాళం శివయ్య, కోటా హరిబాబు, చింతా గంగయ్య, ఒత్తుల వెంకటేశ్వర్లు, అమృతపూడి కోటయ్య, బోడెపూడి వెంకటేశ్వర్లు, లింగా శ్రీను, తహసీల్దార్ సుజాత, ఎంపీడీవో సీతారామయ్య పాల్గొన్నారు.

దివ్యాంగుడికి ట్రై సైకిల్.. కలెక్టర్ చొరవతో సత్వర పరిష్కారం



ట్రై సైకిల్ పొందిన దివ్యాంగుడితో కలెక్టర్ అరుణ్‌బాబు, పక్కన జేసీ సూరజ్

నరసరావుపేట కల్చరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుడికి ట్రై సైకిల్ అందజేసేందుకు కలెక్టర్ పి.అరుణ్‌బాబు చొరవచూపారు. ఈ సంఘటన సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే... సత్తెనపల్లికి చెందిన దివ్యాంగుడు బీరం లక్ష్మీనారాయణ పొలం వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతూ మూడు చక్రాల బండి కావాలంటూ స్పందనలో కలెక్టరేట్‌కు వచ్చి అర్జీ పెట్టుకున్నాడు. దరఖాస్తును పరిశీలించి కలెక్టర్ స్పందించి, అప్పటికప్పుడు బండిని తెప్పించి దివ్యాంగుడికి అందించారు. సాక్షాత్తు కలెక్టర్ తన దరఖాస్తును పరిశీలించి, సత్వరమే బండి ఇచ్చి సమస్య పరిష్కరించటంపై లక్ష్మీనారాయణ ఆనందం వ్యక్తం చేసాడు. కార్యక్రమంలో జేసీ సూరజ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వైఎస్ షర్మిల, విజయమ్మలపై విషం చిమ్ముతున్న జగన్

● కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గర్నెపూడి అలెగ్జాండర్ సుధాకర్

నరసరావుపేట టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రతిపక్ష హోదా కూడా సాధించలేని జగన్‌మోహన్‌రెడ్డి వ్యక్తిగత కక్షతో, ఏపీసీసీ ప్రెసిడెంట్ వైఎస్ షర్మిలరెడ్డికి వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక అక్కసుతో షర్మిల, ఆమె తల్లి విజయమ్మపై విషం చిమ్ముతున్నారని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గర్నెపూడి అలెగ్జాండర్ సుధాకర్ ఆరోపించారు. సోమవారం నరసరావుపేటలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అలెగ్జాండర్ సుధాకర్ మాట్లాడుతూ మరోపక్క తన తండ్రిని చంపించింది ఒకనాడు 2010లో సోనియా గాంధీ, రిలయన్స్ అంబానీ మీద ఆరోపణలు చేసి వారి షాపింగ్ మాల్స్‌ని పగలకొట్టించారన్నారు. ఈ రోజు సీఎం నారా చంద్రబాబు నాయుడుపై నిరాధారమైన నిందలు వేస్తూ ప్రజలను పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ఐదు సంవత్సరాలు సీఎంగా ఉన్నప్పుడు తన తండ్రి మరణం గుర్తుకురాలేదా అని ప్రశ్నించారు. సునీతమ్మ లాగా కోర్టు ద్వారా తండ్రి మరణం గురించి న్యాయ పోరాటం చేయవచ్చుగదా అన్నారు. మీకు అవసరమైనప్పుడల్లా తండ్రి మరణాన్ని రాజకీయం చేయటం చాలా దుర్మార్గం అన్నారు. సమావేశంలో సీదా కృష్ణారావు, రాఘవరపు శ్రీనివాసరావు, మొలతాటి ప్రవీణ్, సత్యం, దేవానంద్, ప్రసాదు, ప్రేమ్, శివ తదితరులు పాల్గొన్నారు.

35 మంది తిరుమల కళాశాల విద్యార్థులకు ఉద్యోగాలు

నరసరావుపేట కల్చరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తిరుమల ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన 35మంది విద్యార్థులు సోమవారం కళాశాలలో జరిగిన ప్రాంగణ ఎంపికల్లో ఉద్యోగాలు పొందినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీ.నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన జస్ట్ డయల్ కంపెనీ కళాశాలలో ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. కళాశాలకు చెందిన 220మంది విద్యార్థులు పాల్గొనగా 35 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు ఆయన చెప్పారు.

పారిశుధ్య కార్మికులకు చెత్త సేకరణ బండ్లు అందజేత

వినుకొండటౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) పారిశుధ్య కార్మికులు నిత్యం ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఆదేశాల మేరకు, కమిషనర్, చైర్మన్ చొరవతో పాడైన చెత్త సేకరణ బండ్లకు మరమ్మతులు చేయించి సోమవారం పారిశుధ్యం కార్మికులకు అందచేశారు. ఈ సందర్భంగా చైర్మన్ డాక్టర్ దస్తగిరి మాట్లాడుతూ తడి చెత్త, పొడి చెత్తను వేరుచేసి ఇవ్వాలన్నారు.

బాలుడి వైద్య ఖర్చులకు రూ.45 వేలు అందజేత

చిలకలూరిపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట ఇన్నర్ వీల్ క్లబ్ వారు నిరుపేద బాలుడి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.45వేలు సాయంగా సోమవారం అందచేశారు. విజయవాడలోని రెయిన్ బో ఆస్పత్రిలో ఉన్న అతడి కుటుంబ సభ్యులకు క్లబ్ అధ్యక్షురాలు గట్టు సరోజిని తదితరులు వెళ్లి ఈ మొత్తాన్ని అందజేశారు. క్లబ్ సభ్యుల సహకారంతో ఈ మొత్తాన్ని సేకరించినట్లు ఆమె తెలిపారు. క్లబ్ కార్యదర్శి జయలక్ష్మి, పూర్వ అధ్యక్షురాలు రమాదేవి, సాదినేని లక్ష్మి పద్మ పాల్గొన్నారు.

ప్రమాద రహితంగా దీపావళి వేడుకలు నిర్వహిద్దాం

● కలెక్టర్ అరుణ్ బాబు

నరసరావు పేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక శాఖలు సమన్వయంతో పనిచేసి జిల్లా ప్రజలు ప్రమాదరహిత దీపావళి వేడుకలు నిర్వహించుకునేందుకు ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు పిలుపునిచ్చారు. అందులో భాగంగా నివాస ప్రాంతాలకు దూరంగా, బహిరంగ ప్రదేశాల్లో తాత్కాలిక బాణ సంచా షాపులకు అనుమతులు ఇవ్వాలన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన అధికారుల సమావేశంలో అయన మాట్లాడుతూ ఎంపికచేసిన స్థలాల్లో పరిమితికి లోబడి షాపులకు అనుమతులు ఇవ్వాలని, ప్రతి రెండు షాపుల మధ్య దూరం కనీసం 10 అడుగులు ఉండేలా చూడాలన్నారు. అనుమతులు లేని షాపులను సీజ్ చేయాలన్నారు. దీపావళి వేడుకలకోసం తీసుకోవాల్సిన అగ్నిమాపక చర్యలపై సమీక్షించారు. కార్యక్రమంలో డీఆర్వో మురళి, జిల్లా అగ్నిమాపక అధికారి పెరంబదూర్ శ్రీధర్, ఆర్డీవోలు మధులత, రమణా కాంత్ రెడ్డి, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఆర్‌కేటీ కాలనీపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి

నరసరావుపేట టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులో ఉన్న ఎస్ఆర్‌కేటీ కాలనీపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని షేక్ నాగూరు సుభాని కోరారు. సోమారం కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగూరు సుభాని మాట్లాడుతూ అసాంఘీక కార్యకలాపాలకు, అలర్లకు, దొంగతనాలకు, గంజాయి, మట్కా, గుట్కా, మద్యం వ్యాపారులకు అడ్డగా మారిందన్నారు. నంబర్లు ప్లేట్లు లేకుండా వాహనాలు నడుపుతూ స్నేక్ కటింగ్, ర్యాష్ డ్రైవింగ్, మద్యం సేవించి వాహనాలు నడుపుతున్నారని అన్నారు. నరసరావుపేటలో ఏ మూలన మర్డర్లు జరిగినా మూలాలు ఎస్‌కేఆర్‌టీ కాలనీలో ఉంటాయని, పోలీసులకు తెలిసినప్పటికీ కఠిన చర్యలు తీసుకోకుండా, కౌన్సెలింగ్ ఇవ్వకుండా అక్రమ వ్యాపారాలు చేస్తున్న వారికి సహకరిస్తున్నారని ఆరోపించారు. పోలీస్ వారు కాలనీపై ప్రత్యేక దృష్టి పెట్టి కాలనీలో అవుట్ చెక్‌పోస్ట్ పాయింట్, సీసీ కెమెరాలు పెట్టాలని కోరారు.

వారాంతపు సెలవులు అమలు చేయాలని కార్మికుల డిమాండ్

నరసరావుపేట టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణాల విస్తరణ మేరకు సిబ్బంది పెంచాలని, ఇంజనీరింగ్ పారిశుధ్యం, ఎన్ఎంఆర్, కొవిడ్, బదిలీ, క్లాప్ డ్రైవర్లకు చట్టబద్ధమైన వారాంతపు, క్యాజువల్, జాతీయ సెలవులు పక్కాగా అమలు చేయాలని కార్మికులు డిమాండ్ చేశారు. సోమవారం నరసరావుపేట మున్సిపల్ కమీషనర్ ఎం జస్వంతరావుకు వినతి పత్రం అందజేశారు. మహిళలపై జరుగుతున్న లైంగిక దాడులు, వేధింపులను నివారించి, సుప్రీంకోర్టు సూచనల మేరకు కంప్లైంట్ కమిటీలను ఏర్పాటు చేయాలని, కమిటీలో మహిళా కార్మికులను సభ్యులుగా చేర్చాలని కోరారు. వెంటనే స్పందించి 15రోజులలో సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళన పోరాటలతో సహా సమ్మెకు, పూనుకోవాల్సివస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో షేక్ శిలార్ మసూద్, టీ మల్లమ్మ, డీ యోహాన్ తదితరులు పాల్గొన్నారు.

కారుచోలలో బోర్‌వెల్ ఏర్పాటు



బోర్‌వెల్‌ను ప్రారంభిస్తున్న కారుచోల టీడీపీ నాయకులు

కారుచోల (యడ్లపాడు), అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): గుంటూరుకు చెందిన ధనిష్ ముస్లిం సంక్షేమ సంస్థ సహకారంతో మండంలోని కారుచోల గ్రామంలోని ముస్లిం కాలనీలో తాగునీటి బోరును ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన టీడీపీ ముస్లిం నాయకులు కాలనీవాసులు తాగునీటి ఇబ్బందులను తీర్చేందుకు సంస్థ కన్వీనర్ జకీర్ హుస్సేన్‌ను సంప్రదించగా బోరు వేసేందుకు ముందుకు వచ్చారు. సుమారు రూ.60వేలతో బోర్‌వెల్‌ను ఏర్పాటుచేసి చేతి పంపును అమర్చారు. సోమవారం స్థానిక నాయకులు బోర్‌వెల్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సయ్యద్ సద్దాం హుస్సేన్, షేక్ సుభాని, షేక్ గౌస్, సయ్యద్ అబ్దుల్ మునాఫ్, షేక్ మొహమ్మద్ ఖాసిం తదితరులు పాల్గొన్నారు.

హైవేపై ప్రమాదాల నియంత్రణకు చర్యలు

● ఎస్‌ఐ బాలకృష్ణ

ఫటాఫట్



యడ్లపాడు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పదహారో నంబరు జాతీయ రహదారిపై తరచూ జరిగే ప్రమాద ఘటనల్లో మృతిచెందడమో లేదా తీవ్రంగా గాయపడడమో జరుగుతోంది. దీంతో హైవేపై ఎప్పుడు ఎక్కడ ఏం జరుగుతుందోనని అటు పోలీసులు, ఇటు ప్రజలు భయపడడం నిత్యకృత్యమైంది. ఈ విషయమై ప్రమాదాల నివారణ, నేరాల నియంత్రణపై ఎస్‌ఐ బాలకృష్ణతో ఆంధ్రజ్యోతితో ఫటాఫట్...

ప్రశ్న: పదహారో నంబరు జాతీయ రహదారిపై ప్రమాదాలకు ప్రధాన కారణం

జవాబు: గ్రామాల మధ్య నుంచి జాతీయరహదారి వెళుతుండడంతోపాటు మండలంలోని అన్ని గ్రామాలు జాతీయరహదారికి అనుసంధానం అయి ఉన్నాయి. దీనితో హైవేపై రద్దీ అధికమై, ప్రమాదాలు పెరుగుతున్నాయి.

ప్రశ్న: ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యలు

జ: గ్రామాల నుంచి జాతీయరహదారికి అనుసంధానం అయ్యే చోట్ల, ఎక్కువగా రహదారిపై ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను బ్లాక్ స్పాట్‌లుగా గుర్తించి హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేస్తున్నాం. హైవే అధికారులతో సమన్వయం చేసుకుని వేగ నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నాం.

ప్రశ్న: ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్న అంశాలు ఏవి?

జ: చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై ప్రత్యేక దృష్టి పెడుతున్నాం. ప్రధానంగా పేకాట, లాటరీ టిక్కెట్ల విక్రయం, కోడి పందాలు, మాదక ద్రవ్యాల విక్రయాల నియంత్రణకు కృషిచేస్తున్నాం. గత రెండు నెలల్లో వివిధ గ్రామాల్లో పేకాట స్థావరాలపై దాడులు నిర్వహించి 5 కేసులు నమోదు చేసి, శిక్ష పడేలా చేస్తున్నాం. లాటరీ టిక్కెట్ల విక్రేతను కూడా అరెస్టు చేశాం.

ప్రశ్న: నేరాల రేటు ఎలా ఉంది.

జ: గత ఏడాదిన్నర కాలంలో వాహనాల చోరీ, సెల్‌ఫోన్ మిస్సింగ్, చిన్న దొంగతనాలపై కేసులు నమోదయ్యాయి. సెల్‌ఫోన్‌లు మిస్సింగ్‌కు సంబంధించి ప్రభుత్వం రూపొందించిన యాప్‌తో ట్రాక్‌చేసి బాధితులకు అందజేస్తున్నాం.

ప్రశ్న: మత్తు పదార్థాలపై తీసుకుంటున్న చర్యలేమిటి?

జ: గంజాయి, మత్తు పదార్దాల విక్రయాలు, వినియోగంపై ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేశాం. నిఘా బృందాలతో కలసి ఆకస్మిక తనిఖీలు చేపడుతున్నాం.



కార్యక్రమంలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, ఇతర అధికారులు

ప్రతి అర్జీని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

● పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు

నరసరావుపేట టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ప్రతి అర్జీని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ పీ అరుణ్‌బాబు అన్నారు. సోమవారం నరసరావుపేటలోని పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. కలెక్టర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు అర్జీల ద్వారా సమస్యలను వినతి పత్రాల ద్వారా విన్నవించారు. పీజీఆర్ఎస్‌లో 105 అర్జీలు నమోదయ్యాయి. పీజీఆర్ఎస్‌పై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ పీ అరుణ్‌బాబు చెప్పారు. ఆన్‌లైన్‌లో వచ్చిన ప్రతి అర్జీని నిక్షిప్తం చేయాలన్నారు. 31వ తేదీన దీపావళి పండుగ నేపథ్యంలో ఎన్టీర్ భరోసా పెన్షన్ పథకానికి అవసరాన్ని బట్టి ముందస్తుగానే బ్యాంకుల నుంచి నగదు డ్రా చేసుకోవాలన్నారు. ఒకటో తేదీన ఉదయం ఐదున్నర గంటలకి లబ్ధిదారులకు సచివాలయాల సిబ్బంది పింఛన్ నగదు పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ సూరజ్, జిల్లా రెవెన్యూ అధికారి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఖోఖో ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టుకు రొంపిచర్ల జడ్పీ పాఠశాల విద్యార్థిని ఎంపిక



పూజల గీతాలక్ష్మి

రొంపిచర్ల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): నకరికల్లు మండలం నకరికల్లులో జడ్పీ పాఠశాలలో సోమవారం ఉమ్మడి గుంటూరు జిల్లా అండర్ - 17 బాల బాలికల ఖోఖో క్రీడాకారుల ఎంపిక జరిగింది. ఈ ఎంపికలో రొంపిచర్ల జడ్పీ పాఠశాలకు చెందిన పూజల గీతాలక్ష్మి ఎంపికైనట్టు హెచ్‌ఎం సుభానీ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినిని హెచ్‌ఎం, పీడీ సైదయ్య, విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాఠశాల మానిటరింగ్ కమిటీ చైర్మన్ ఇట్టే కొండలు, విద్యార్థులు అభినందించారు. నవంబరు 2వ తేదీన అనకాపల్లిలో జరిగే రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో జిల్లా జట్టులో గీతాంజలి ఆడనుంది.

ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలి: ఎస్పీ

నరసరావుపేట లీగల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమంలో వచ్చే ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు సంబంధిత అధికారులకు సూచించారు. సోమవారం పల్నాడు జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజల వద్ద నుంచి 77 ఫిర్యాదులను స్వీకరించారు. పట్టణానికి చెందిన ప్రత్యూషకు 2022లో హైదరాబాద్‌కు చెందిన సాయి సంతోష్‌తో వివాహం అయినట్టు, ప్రస్తుతం అదనపు కట్నం కోసం వేధిస్తున్నట్టు ఫిర్యాదుచేశారు. లింగంగుంట్ల గ్రామానికి చెందిన మండాది జ్యోతి తన బంధువులైన ప్రభుదాసు అనే అతను తనను, తన భర్తను ఇబ్బంది పెడుతున్నారని, భయపెడుతున్నాడని, అతని నుంచి రక్షణ కల్పించాలని ఫిర్యాదు చేశారు. ములకలూరుకు చెందిన బాజమ్మ పట్టణంలోని ఫైవ్‌స్టార్ ఫైనాన్స్‌లో లోనుతీసుకుందని, తనకు రావాల్సిన నగదులో తగ్గించి ఇచ్చి ప్రస్తుతం అధిక మొత్తం కావాలని ఒరినల్ డాక్యుమెంట్‌లు తీసుకొని వేధిస్తున్నారని ఫిర్యాదు చేసింది.

70వేల మంది విద్యార్థులు విద్యకు దూరం: నాసర్

వినుకొండ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 77 జీ.వోతో 70 వేల మంది విద్యార్థులు విద్యకు దూరమయ్యారని, దీనిపై పోరాటాలు సాగించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బందెల నాసర్ పిలుపునిచ్చారు. శివయ్య భవన్‌లో అఖిల భారత్ విద్యార్థి సమాఖ్య వినుకొండ నియోజకవర్గం నిర్మాణ మహాసభను సోమవారం నిర్వహించారు. సమావేశంలో బందెల నాసర్ మాట్లాడుతూ సాంఘీక సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు సొంత భవనాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా పెద్దేటి అభిషేక్, బోధనం శ్రీనివాస్‌లతో పాటు మరో 30మంది సభ్యులతో నియోజకవర్గం సమితిని ఎన్నుకున్నారు.

భూ సమస్యలు పరిష్కరించాలంటూ 55 అర్జీలు

యడ్లపాడు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కారుచోల రెవెన్యూ గ్రామ పరిధిలోని గుత్తావారిపాలెం, కారుచోల గ్రామాలలో అధికారులు సోమవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. తహసీల్దార్ జె.విజయశ్రీ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రెవెన్యూ పరిధిలోని రెండు గ్రామాలలో వివిధ భూ సమస్యలకు సంబంధించిన 55 అర్జీలు అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ సురేంద్ర, ఆర్ఐ జయరాజు, ఎండోమెంట్ ఈవో శివయ్య వీఆర్వో కేపీ చారి, విలేజ్ సర్వేయర్లు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఇర్లపాడులో 40 అర్జీలు

నాదెండ్ల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇర్లపాడులో రెవెన్యూ గ్రామ సభను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా భూ సమస్యలకు సంబంధించి 40అర్జీలను రైతుల నుంచి స్వీకరించారు. కార్యక్రమంలో డీటీ ఎన్ ధనలక్ష్మి, సర్వేయర్ రాంబాబు, వీఆర్వో నాగేంద్రబాబు పాల్గొన్నారు.

చెకుముకి పరీక్షలో సాతులూరి విద్యార్థులకు తృతీయ స్థానం

నాదెండ్ల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సాతులూరులోని ఈతరం పాఠశాలకు చెందిన విద్యార్థులు చెకుముకి ప్రతిభా పరీక్షలో తృతీయ స్థానం సాధించారు. చిలకలూరిపేట పట్టణంలోని సాధినేని చౌదరయ్య పాఠశాల ప్రాంగణంలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జిల్లాస్థాయి పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఈతరం విద్యార్థులైన కిలారు భువనశ్రీ, యన్నం లక్ష్మీ లోహిత, షేక్ సుహానాలు సంయుక్తంగా జిల్లా స్థాయిలో తృతీయ స్థానం సాధించారు. ఎమ్మెల్సీ లక్ష్మణరావు వీరికి జ్ఞాపిక, ప్రశంశా పత్రాలు అందజేశారు. వీరిని ఈతరం పాఠశాల డైరెక్టర్లు బండారుపల్లి సత్యనారాయణ, పాటిబండ్ల శివరామకృష్ణ ప్రసాదు బాబు, ఉపాధ్యాయులు అభినందించారు.